ISSN 2278-3423

Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

# సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

# మా ఇంటి వంట!
# ఆహార రాజకీయాలు-ఆధిపత్య భావజాలం

*సంచిక : 4 (త్రైమాసికం)* *తెలుగు & ఇంగ్లీష్* *సెప్టెంబరు 2012* *విరాళం : 15 రూ.*



హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పెద్దకూర పండగలో పాల్గొన్న విద్యార్థులు

విషయసూచిక


- సంపాదకీయం: ఏం కూర? ఆహారంలో ఆధిపత్యం
- సార్వజనీన స్థలాల ప్రజాస్వామీకరణ : హైదరాబాదు విశ్వవిద్యాలయంలో పెద్ద కూర దుకాణం
  *సాంబయ్య గుండిమెడ*
- వెజిటేరియన్స్ ఓన్లీ
  *సాయిబాబా*
- ఆహార శుద్ధి కోసం గోమూత్రం
  *గుల్వాడి వెంకట్‌రావు*
- ఆధునిక భారత దేశం శాకాహార దేశమా?
  *స్నేహ షాజ్*
- పెద్దకూర, ఆరోగ్యం-దళిత విద్యార్థి సంఘం ఉత్తరం
- కష్టపడే చేతుల బలానికి ఆధారం
  *దు. సరస్వతి*
- "ఆహార సంస్కృతి - రాజకీయాలు' చర్చ
  *ఉమ భృగుబండ*
- పని స్థలం(కబేళా)
  *జరీన్ అహ్మద్*
- హైదరాబాద్‌లో బీఫ్ వ్యాపారం
  *ఫహీమ్ ఖురేషి*
- అది మా ప్రాణం
  *గోగు శ్యామల*
- ఆవుని తిని ఆవులా అయ్యాను
  *ఎన్.కె.హనుమంతయ్య*


***ప్రత్యేక సంపాదకులు : సాంబయ్య గుండిమెడ, వి.బి.తారకేశ్వర్, ఉమ భృగుబండ***

***సంపాదకులు:*** *ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్*

***అడ్వయిజరీ బోర్డ్:*** *షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మెల్కొటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూజీ థారు, వీణా శత్రుఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, వి.ఉష.*

***ప్రొడక్షన్:*** *ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి*

***ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,*** 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు-13.

వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి

# సంపాదకీయం

# ఏం కూర? ఆహారంలో ఆధిపత్యం

ఈ సంవత్సరం ఏప్రిల్ 15వ తేదీన ఉస్మానియా యూనివర్శిటీలో అనేక విద్యార్థి సంఘాలు కలిసి పెద్దకూర (బీఫ్) పండుగను జరుపుకొన్నాయి. అయితే ఈ పండుగ జరపాలన్న తొలి రోజునుంచే ఇది వివాదాస్పదంగా మారింది. దాంతో క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎబివిపి విద్యార్థులు పండుగను జరుపుకొంటున్న విద్యార్థులపై రాళ్ళతో దాడి చేశారు. ఒక వాహనాన్ని తగులపెట్టారు కూడా. ఇంకో గ్రూపుకు చెందిన విద్యార్థులు ఒక విద్యార్థిని కత్తితో గాయపరిచారు. ప్రస్తుతం క్యాంపస్‌లో ఉద్రిక్తత తగ్గినప్పటికీ, ఈ విషయంపైన పత్రికల్లో, సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతూనే ఉంది. ఇదిలా ఉండగా, ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలోని కొన్ని విద్యార్థి సంఘాలు పెద్దకూర మరియు పందికూర (పోర్క్) పండుగ జరుపబోతున్నామని ప్రకటించాయి. అయితే, ఈ పెద్దకూర వివాదం కొత్తదేమీ కాదు. హైదరాబాద్‌లోని యూనివర్శిటీ హాస్టళ్ళలో వండి వడ్డిస్తున్న ఆహారంపై గత ఇరవై సంవత్సరాలుగా తీవ్ర చర్చలు, వాదోపవాదాలు, కొన్ని సందర్భాల్లో దాడులు కూడా జరుగుతూనే ఉన్నాయి. 1997లో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ [CIEFL (ఇప్పుడు EFL యూనివర్శిటీగా మారింది)]. హాస్టల్‌లో పెద్దకూరను ప్రవేశ పెట్టాలని అప్పటి మెస్ సెక్రటరీ నిర్ణయించారు. చాలా మంది విద్యార్థులు దీన్ని ఆహ్వానించారు. వీళ్ళలో బెంగాలీ మరియు మలయాళీ విద్యార్థులు, ముస్లిమ్ మరియు క్రిస్టియన్ విద్యార్థులు, కొంత మంది దళిత విద్యార్థులు ఉన్నారు. అలాగే అగ్రకులాలకు చెందిన కొంత మంది విద్యార్థులు, కొంత సామాజిక స్పృహ కలిగి ఉండడం వల్ల, వాళ్ళు పెద్దకూర తినకపోయినప్పటికీ, మెస్‌లో పెద్దకూరను ప్రవేశపెట్టడాన్ని సమర్థించారు. కానీ మిగిలిన అగ్రకులాల విద్యార్థులు, యూనివర్శిటీ అధికారులు, అధ్యాపక మరియు ఉద్యోగ సంఘాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆఖరికి 'హెడ్ కుక్' కూడా తాను పెద్దకూర వండేది లేదని తెగేసి చెప్పాడు. అయితే విద్యార్థులే పట్టుబట్టి పెద్దకూరను, పందికూరను తామే సొంతంగా వండి, తిని, కావలసిన వారికి వడ్డించారు. ఇది ఒక నెల రోజులు మాత్రమే సాగింది. ఆ మరుసటి నెలలో వచ్చిన మెస్ సెక్రటరీ మరియు మెస్ కమిటీ సభ్యులు పెద్దకూరను, పందికూరను మెనూ నుంచి తొలగించారు.

2006వ సంవత్సరంలో, హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో విద్యార్థులు ఏటా జరుపుకునే 'సుకూన్' పండుగ సందర్భంగా పెద్దకూర విషయం మళ్ళీ తెరమీద కొచ్చింది. పెద్దకూర తమ సంప్రదాయంలో భాగం కాబట్టి ఒక 'పెద్దకూర ఫుడ్‌స్టాల్'ను పెట్టుకోవడానికి అనుమతివ్వాలని దళిత విద్యార్థులు యూనివర్శిటీ అధికారులను కోరారు. ఇది కుల, మత ఘర్షణలకు దారితీస్తుందనే నెపంతో అధికారులు దీనికి అంగీకరించక పోవడంవల్ల, దళిత విద్యార్థులు కొన్ని విద్యార్థి సంఘాల సహకారంతో పెద్దకూర స్టాల్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. పెద్దకూర తినడం భారతీయ సంస్కృతికి వ్యతిరేకమని ఎబివిపి విద్యార్థులు గొడవ చేశారు. మెజారిటీ విద్యార్థులు, విద్యార్థి సంఘాలు దళిత విద్యార్థుల పక్షాన నిలవడంతో అధికారులు దిగివచ్చి పెద్దకూరను అనుమతించారు. మళ్ళీ 2010లో, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ (ఒకప్పటి CIEFL) క్యాంపస్‌లో పెద్దకూరను వండి సామూహికంగా తినే కార్యక్రమాన్ని నిర్వహించారు. అయిదే దీన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థులు నిర్వాహకులపైన రాళ్ళతో దాడి చేసి వండినకూరను పారబోశారు.

యూనివర్శిటీల్లో పెద్దకూర పండుగను జరపాలని దళిత విద్యార్థులెందుకు పట్టుబడుతున్నారనే ప్రశ్న మనకు కలుగుతుంది. ముందెప్పుడూ లేని ఈ డిమాండ్ ఇప్పుడెందుకు ముందుకొచ్చింది? దీన్ని ఛాందసవాద హిందూ అగ్రకులాల విద్యార్థులెందుకు అడ్డుకుంటున్నారు? యూనివర్శిటీల్లాంటి ఆధునిక ఉన్నత విద్యాసంస్థలపై మన దేశంలో ఉన్న ప్రతి పౌరుడికి హక్కు ఉన్నప్పటికీ, ఈ సంస్థలు చాలా కాలంగా అగ్రకులాల ఆధీనంలో ఉన్నాయి. కానీ గత ఇరవయ్యేళ్ళుగా దళిత, ఆదివాసీ, మైనారిటీ మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఈ సంస్థల్లో స్థానం సంపాదించుకున్నారు. యూనివర్శిటీలు అగ్రకులాల చేతుల్లో ఉన్నంత కాలం, అక్కడ జరిగే ప్రతి కార్యక్రమంలో అగ్రకుల ఆధిపత్య సంస్కృతే రాజ్యమేలేది. చివరికి హాస్టల్‌మెస్‌లో తినే తిండి విషయంలో కూడా నిర్ణయాధికారం వాళ్ళదే. బ్రాహ్మణుల మరియు బ్రాహ్మణేతర అగ్రకులాల ఆహారమైన శాకాహారం, చికెన్ మరియు మటన్‌లకు మాత్రమే స్థానముండేది. దళిత విద్యార్థులక్కూడా ఈ ఆహారం తినే అలవాటున్నప్పటికీ, ఇంటి దగ్గర పెద్దకూరను తరచుగా తినడం వాళ్ళకు బాగా అలవాటు. నిజం చెప్పాలంటే కూరగాయలు మరియు మాంసం కొనలేని దళితులకు చవకగా దొరికే పోషకాహారం పెద్దకూరొక్కటే. ఎప్పట్నుంచో తినడానికి అలవాటుపడిన ఈ పెద్దకూర దళిత విద్యార్థులకు యూనివర్శిటీల్లో, హాస్టళ్ళలో దొరకకపోవడం వాళ్ళకొక సమస్యయింది. అగ్రకులాల విద్యార్థులకు యిలాంటి సమస్యలేదు. వాళ్ళు యింటి దగ్గరేంతింటారో అదే యూనివర్శిటీ హాస్టళ్ళలో దొరుకుతుంది. వాళ్ళు యింటి దగ్గరున్నా, హాస్టళ్ళలో ఉన్నా తినే తిండి ఒక్కటే. దళిత విద్యార్థులకు ఎదురవుతున్న అనుభవం మాత్రం దీనికి భిన్నంగా ఉంది. సంప్రదాయంగా తాము ఇంటి దగ్గర తినే ఆహారం హాస్టళ్ళలో దొరకకపోగా, వాళ్ళకు పెద్దకూర తినే అలవాటున్నందుకు అవమానించబడుతున్నారు. పైగా, చిన్నప్పట్నుంచీ అలవాటైన ఆహారానికి చాలా కాలంగా దూరవమడం వల్ల, ఇది వారికి ఒక లోపంగా పరిణమించడమే కాకుండా, వాళ్ళ చదువుపైన, మొత్తంగా వాళ్ళ జీవితంపైన తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.

హైదరాబాద్ యూనివర్శిటీల్లో చదువుకొంటున్న దళిత విద్యార్థులు మంచి (పెద్దకూర) భోజనం చేయాలనుకున్నప్పుడు, పెద్దకూర మరియు పెద్దకూర బిర్యానీ దొరికే కళ్యాణి బిర్యాని హొటళ్ళ కెళతారని మనకు తెలుసు. ఈ హొటళ్ళు హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో చాలా బస్తీల్లో ఉన్నాయి. ఒక్కోసారి దళిత విద్యార్థులు పెద్దకూర మాంసాన్ని కొని తెచ్చుకొని హాస్టళ్ళలో వండుకొని తింటూ ఉంటారు.

మన యూనివర్శిటీల్లోకి ఎస్.సి, ఎస్.టి, మరియు బి.సి విద్యార్థుల ప్రవేశంవల్ల మన పబ్లిక్ సంస్థలు అవలంబిస్తున్న విధానాల గురించి మన లౌకిక రాజకీయాల గురించీ కొన్ని ప్రశ్నలను లేవనెత్తడానికి సాధ్యమైంది. హాస్టళ్ళలో పెద్దకూరను వడ్డించాలనడం, పెద్దకూర 'స్టాల్స్'ను సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేయాలనడం, పెద్దకూరను బహిరంగంగా తినడం లేదా దాన్ని ఒక పండుగగా జరుపుకోవడం, ఇవన్నీ కూడా ఒక స్పష్టమైన రాజకీయ అవగాహనతో శాకాహారాధిపత్యాన్ని ఎదిరిస్తున్న కార్యక్రమాలు. వీటిని దళితులు మరియు యితర అణచివేయబడిన వర్గాలు తమ సంస్కృతి మరియు ఆత్మగౌరవానికి సంబధించి చేస్తున్న పోరాటంలో భాగంగా చూడాలి.

ఈ మధ్య ఉస్మానియా యూనివర్శిటీలో జరుపుకొన్న పెద్దకూర పండుగ విషయంలో ఇంకో ఆసక్తికర కోణం కూడా ఉంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడుతున్నది దళిత మరియు యితర అణచివేయబడ్డ సామాజిక వర్గాల విద్యార్థులే. వీరు కేవలం 'భౌగోళిక తెలంగాణ' కాకుండా, 'సామాజిక తెలంగాణ' కావాలని డిమాండ్ చేస్తున్న విషయం మనకు తెలుసు. సామాజిక తెలంగాణ అంటే కొత్తగా ఏర్పడబోయే తెలంగాణ రాష్ట్రంలో

సామాజికంగా వెనుకబడిన వర్గాలు గౌరవంగా ఎలాంటి వివక్షకు గురి కాకుండా బ్రతగ్గలగాలి. అలాగే అన్ని పబ్లిక్ సంస్థల్లో వారికి సమాన ప్రాతినిధ్యం ఉండాలి. ఈ కోణంలో చూసినప్పుడు, తెలంగాణోద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న ఎబివిపి ఆధిపత్యాన్ని ప్రశ్నించడానికే దళిత విద్యార్థులు పెద్దకూర పండుగను జరుపుకొన్నారని, వాళ్ళ సంస్కృతిని కాపాడుకోవడానికే ఆ కార్యక్రమాన్ని తలపెట్టారని మనం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారమంతా బహిరంగ ప్రదేశాలు మరియు ప్రజల సంస్కృతిని ప్రజాస్వామీకరించడానికి వాళ్ళు చేసిన ప్రయత్నంలో భాగమే.

కొంచెం పక్కకెళ్ళి, అసలు యూనివర్శిటీల్లో పెద్దకూరను వ్యతిరేకిస్తూ వచ్చిన వాదనల్ని ఒకసారి పరిశీలిద్దాం. ఇందులో పెద్దకూర తినడం హిందూ సంస్కృతికి, ఇంకా చెప్పాలంటే భారతీయ సంస్కృతికి వ్యతిరేకమనేది మొదటిది. అయితే ఇక్కడ ఎవరి సంస్కృతిని హిందూ సంస్కృతిగా పరిగణిస్తున్నారనేది ప్రశ్న. పురాతన భారత దేశంలో బ్రాహ్మణులతో సహా అన్ని కులాలవారు ఆవు మాంసాన్ని తినేవారని చరిత్రకారులు మనకు చెబుతున్నారు. అలాగే బౌద్ధ, జైన మతాల నుండి ఎదురైన సవాళ్ళను ఎదుర్కొనే క్రమంలో హిందూమతం శాకాహారాన్ని అరువు తెచ్చుకుని, ఒక గొప్ప 'హిందూ' లక్షణంగా మలచుకొన్నదని కూడా మనకు చరిత్రకారుల ద్వారా తెలుస్తుంది. అలాగే పంతొమ్మిదవ శతాబ్దంలో ఉత్తర భారత దేశంలో జాతీయోద్యమ కాలంలో ఆవు హిందూమత చిహ్నంగాను హిందువులందర్నీ కూడగట్టడానికి ఒక సాధనంగాను అవతరించింది. అంతేగాకుండా 'గో సంరక్షణ ఉద్యమం' పెద్దకూరను తింటున్నారనే నెపంతో ముస్లింలపైన దాడులు చేసింది.

పెద్దకూరను హిందూ ఛాందసవాదులు ఎందుకు అడ్డుకొంటున్నారనే విషయంపై దళితవాదులు అనేక విమర్శలు చేసారు. ఇందులో ప్రధానంగా వినిపించేది, దళితులు ఎన్నో ఏళ్ళుగా హిందూకుల చట్రంలో అణచివేతకు గురవుతున్నారనేది. ఈ కులాధిపత్య వ్యవస్థ గుళ్ళ దగ్గర పశువుల్ని బలి ఇచ్చే కార్యక్రమాన్ని దళితుల ద్వారా బలవంతంగా చేయించింది. ఆ తర్వాత వాళ్ళతో ఆ పశువుల మాంసాన్ని తినిపించి, వాటి చర్మంతో చెప్పులను తయారు చేయించుకొన్నదీ ఈ అగ్రకులాలే. అయితే చాలా చోట్ల దళితులు తాము పశుబలి కార్యక్రమంలో పాల్గొనబోమని ఎదురు తిరిగారు. చచ్చిపోయిన పశువుల కళేబరాలను ఊరి నుండి బయటకు తరలించడానికి అగ్రకులాలు తమను ఎలా వాడుకొంటున్నాయో కూడా దళితులు ఎత్తిచూపుతున్నారు. రెండవది, పశువులతో అగ్రకులాల కంటే తమకే ఎక్కువ అవినాభావ సంబంధమున్నదని దళితులు గుర్తు చేస్తున్నారు. అగ్రకులాల వారు ఆవును కేవలం పూజించి వదిలేస్తారు. కానీ దళితులు పశువుల్ని శుభ్రంగా కడిగి, వాటికి మేతవెట్టి, జబ్బు చేసినపుడు మందులేసి వాటిని జాగ్రత్తగా కాపాడుకొంటారు. 'కుంభార వీరభద్రప్ప' రాసిన ఒక కన్నడ కథలోని ఒక మాదిగ కూలీ చచ్చిపోయిన పశువుల కళేబరాలు తన హక్కని వాదిస్తాడు. 'గౌడ' అనే భూస్వామి తన ఆవు చచ్చిపోతే పాతిపెడ్తాడు. కానీ మాదిగ అర్థరాత్రి సమయంలో ఎవరికీ తెలియకుండా వెళ్ళి తవ్వి ఆవు కళేబరాన్ని స్వాధీనం చేసుకొంటాడు. ఇది తెలుసుకొన్న భూస్వామి ఆశ్చర్యానికి గురౌతాడు. పోలీసుల్ని పిలిపిస్తాడు. వాళ్ళు కూడా ఇది చూసి తీవ్ర ఆశ్చర్యానికి లోనవుతారు. కాబట్టి పెద్దకూర తినడం వల్ల తమకు అంటగట్టబడుతున్న వెనుకబాటుతనాన్ని మరియు నీచత్వాన్ని వేలెత్తి చూపిస్తూ, అసలు హిందూ సంస్కృతి అంటే ఏంటి అని దళితులు ఈనాడు ప్రశ్నిస్తున్నారు. ఈ మొత్తం దళిత విమర్శ, పెద్దకూర తింటే తమ మనోభావాలు దెబ్బతింటాయనే అగ్రకులాల వాదనను జటిలం చేస్తుంది.

పెద్దకూరను వ్యతిరేకించే వాళ్ళు ఇంకో వాదన కూడా చేస్తున్నారు. అదేంటంటే, హాస్టళ్ళు అందరికీ చెందినవి కాబట్టి, మెజారిటీ విద్యార్థుల మనోభావాలను గౌరవించాలని వాళ్ళు వాదిస్తున్నారు. అయితే యింతకు ముందే చెప్పినట్లుగా ఇది వాళ్ళ అగ్రకుల ఆధిపత్య సంస్కృతిని సూచిస్తుంది. ఈ అగ్రకుల సంస్కృతే ఆధునికమని, లౌకికమని తనకు తానుగా నిర్వచించుకుంటుంది. మనం యిక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. అదేంటంటే ఒక పది సంవత్సరాల పరిస్థితిని ఈరోజు పరిస్థితితో పోల్చి చూస్తే, శాకాహార ఆధిపత్యం కొంతవరకు తగ్గిందని చెప్పవచ్చు. హైదరాబాద్ లాంటి అన్ని మహానగరాల్లో చిన్న, పెద్ద హోటళ్ళు మాంసాహారాన్ని బహిరంగంగానే విక్రయిస్తున్నాయి. ఇప్పుడొచ్చిన ఇంటర్నేషనల్ రెస్టారెంట్స్ అనేక రకాల, అనేక దేశాల శాకాహార మరియు మాంసాహార వంటలను అందిస్తున్నాయి. అయినప్పటికీ, పెద్దకూర మాత్రం కేవలం కొన్ని రెస్టారెంట్లలోనే దొరుకుతుంది. ఇది పేదలు వెళ్ళే అతి సామాన్యమైన హొటళ్ళకు లేదా ధనవంతులు వెళ్ళే అతి ఖరీదయిన హొటళ్ళకు మాత్రమే పరిమితమై పోయింది. ఇదంతా చూసినప్పుడు మనకు అర్థమయ్యేదేంటంటే, బయట అన్ని రకాల మాంసం అందుబాటులో కొచ్చినప్పటికీ, హాస్టల్ మెస్‌ను మాత్రం జాతీయ సంస్కృతికి ఒక ప్రతీకగా చూస్తూ దానికి ఈ పెద్దకూర వాసన కూడా తగలకుండా చేసే ప్రయత్నం కొనసాగుతోంది.

పెద్దకూర పోషకాహారం కాదనీ, అది తింటే అంటువ్యాధుల బారినపడే ప్రమాదముందనే ఒక తప్పుడు అవగాహన చాలా బలంగా ఉంది. పెద్దకూరను వ్యతిరేకించే వాళ్ళు పదేపదే ఈ వాదనను పైకి తెస్తుంటారు. దీనిపై తమ అభిప్రాయాన్ని కోరుతూ, 2008లో యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన కొంత మంది దళిత విద్యార్థులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌కు (NIN) ఒక ఉత్తరాన్ని రాశారు. దీనికి అప్పటి డెప్యూటీ డైరెక్టరుగా ఉన్న వీణాశతృఘ్ను నుంచి వారికి సమాధానమొచ్చింది. ఆమె తన లేఖలో పెద్దకూరలో పోషక విలువలు మెండుగా ఉంటాయనీ, దాన్ని తినడం వల్ల అంటువ్యాధులు రావనీ పేర్కొన్నారు. వీణాశతృఘ్ను ఇంకో చోట రాస్తూ, శాకాహార ఆధిపత్యం హాస్టళ్ళనే కాకుండా దేశం మొత్తాన్నే ప్రభావితం చేసిందని వాదించారు. అందువల్లే అందరికీ అందుబాటులో ఉండే మాంసం, గుడ్లు చాలా మంచి పోషకాహారమని నేషనల్ న్యూట్రిషన్ పాలసీ గూడా గుర్తించలేదనీ, అలాగే వాటిని పౌష్టికాహారం అందుబాటులో లేని మన ప్రజలకు అందించవచ్చనే విషయాన్ని కూడా వాళ్ళు పరిగణనలోకి తీసుకోలేదనీ ఆమె వాపోయారు.

పెద్దకూరను కేవలం ఒక మతపరమైన లేక సాంస్కృతికపరమైన విషయంగా పరిగణించిన వాళ్ళు, దానికున్న ఇంకొక చాలా ముఖ్యమైన ఆర్థిక కోణాన్ని మాత్రం పూర్తిగా విస్మరించడం జరుగుతూ ఉంది. పెద్దకూర మీదే ఆధారపడి ఒక పెద్ద పరిశ్రమ మరియు వ్యాపారం నడుస్తున్న విషయాన్ని మనం మరవకూడదు. మాంసాన్ని విక్రయించడమే కాకుండా, జంతువుల అవయవాలను, చర్మాన్ని అనేక వస్తువులను తయారు చేయడానికి, అలాగే మందుల తయారీలోను వాడుతుంటారు. ఈ మొత్తం వ్యాపారంలో హిందువులూ, ముస్లింలూ భాగస్వాములు. దేశంలోపలే కాకుండా ఎగుమతుల్లో కూడా ఈ వ్యాపారం జరుగుతూ ఉంది. ఈ పరిశ్రమలో అనేక దళితులు మరియు ఖురేషీలనే అతి పేద ముస్లింలు పనిచేస్తూ బతుకుతున్నారు. గోసంరక్షణ వాదులు, జంతువులక్కూడా హక్కులున్నాయనే వాళ్ళు, ఈ వర్గాల ప్రజలనెప్పుడూ పట్టించుకోరు. అలాగే, జంతువుల్ని చంపకూడదని వచ్చిన చట్టాలు దొంగ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నాయనే విషయాన్ని గానీ అందువల్ల పెద్దకూర ధరలు ఎక్కువయ్యాయనే విషయాన్ని కూడా వాళ్ళు పట్టించుకోరు. ఈ బ్రాడ్‌షీట్‌లో యిలాంటి అనేక విషయాల్ని చర్చించడం, ప్రశ్నించడం, అర్థం చేసుకునే ప్రయత్నం జరిగింది. ఇంతవరకూ వచ్చిన బ్రాడ్‌షీట్‌ల లాగా కేవలం అకడమిక్ లేక జర్నలిస్టిక్ రాతలకే పరిమితం గాకుండా, ఈసారి అన్ని రకాలైన రచనలను, అంటే ఫిక్షన్, కవితలు, అనుభవాలకు సంబంధించిన రచనలు, కొన్ని చిత్రాలు, అలాగే అణచివేతకు గురయిన ప్రజలు వెళ్ళే హొటళ్ళలో అందుబాటులో ఉండే ఆహారపు వివరాలతో సహా ఈసారి మీకందిస్తున్నాం.

**ప్రత్యేక సంపాదక బృందం**

**అనువాదం: ఎన్.మనోహర్**

# సార్వజనీన స్థలాల ప్రజాస్వామీకరణ: హైదరాబాదు విశ్వవిద్యాలయంలో పెద్ద కూర దుకాణం

■ సాంబయ్య గుండిమెడ

హిందూ కుల సమాజ విలువల ప్రకారం, ఆహార అలవాట్ల అవరోహణ క్రమంలో పై మెట్టున శాకాహారులుంటే, మధ్యలో మాంసాహారులు, అట్టడుగు స్థాయిలో పెద్దకూర తినే మాంసాహారులుంటారు. 1916లో 'అస్పృశ్యత– పుట్టుపూర్వోత్తరాలు' వ్యాసంలో అంబేద్కర్ హిందూ సమాజంలో ఉండే ఈ రెండు నిషేధాలని, వాటి సామాజిక సాంస్కృతిక ఉద్దేశాలని ఈ విధంగా వివరించారు: మొదటిది, మాంసాహారానికి వ్యతిరేకంగా ఉండే నిషేధం. ఇది హిందువులని శాకాహారులు, మాంసాహారులుగా విడగొడ్తుంది. రెండవ నిషేధం పెద్దకూరకు వ్యతిరేకమైనది. హిందువులని పెద్దకూర తినేవారిగానూ, తినని వారిగానూ విభజిస్తుంది.

ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ ఆహార అలవాట్ల నిచ్చెన బ్రాహ్మణీయ కులకట్టుబాట్లపై ఆధారపడి  లేదు. అహింస ఉన్నత విలువనీ, అన్ని జీవాలనూ క్రమానుగత శ్రేణులుగా చూడాలనీ, అన్నింటికన్నా ముఖ్యంగా 'ఆవు' అత్యంత పవిత్రమైన జంతువనే భావనలన్నీ కలిపిన ఒక సంక్లిష్ట భూమికపై ఇది నిర్మితమయింది. ఆధునిక భారతదేశంలో ఈ పునాదిని నిర్మించింది మరెవరో కాదు, అణువణువునా హిందువయిన మహాత్మాగాంధీయే......

ఈ రకమైన చర్చల్లో ఆవుని చంపటమూ, ఆ మాంసాన్ని తినటమూ అనైతిక చర్యలు. అనవసరమైనవి కూడా. అయితే నిజజీవితంలో ఏ కులాలు, సమూహాలు ఏం తింటాయి, ఏం తినాలి అనే విషయాలు అంత స్పష్టంగా లేవు. చాలా గందరగోళం కన్పిస్తుంది. ఉదాహరణకి, బెంగాల్‌లోని అన్ని శాఖల బ్రాహ్మణులు, కర్నాటక తీర ప్రాంతాలలోని సారస్వత బ్రాహ్మణులు చక్కగా చేపలు తింటారు. కుల నిచ్చెనలో మధ్యకులాలైన వైశ్యులు, లింగాయత్‌లేమో శాకాహారులు!.....

అయితే పెద్దకూర గురించి ఇటువంటి హిందూ చర్చల ప్రభావం దళితులపై భయానకంగా ఉంటుంది. ఇది తింటారనే సాకుతో సామాజిక జీవనంలో వారిని నిత్యం అవమానాలకు గురిచేస్తారు. హిందూ ఛాందసవాదం పెరిగిన తరువాత, అనేక సందర్భాలలో అగ్రకులాలవారు, ఆవుని చంపారనే నెపం మీద దళితులను ఊచకోత కోసారు. దళితులు ఇటువంటి హిందువుల కంటపడకుండా, దొంగతనంగా బీఫ్ తినవలసి వస్తోంది. దీనర్థం, దళితులు ఈ అణచివేతకు తలవంచుతున్నారని కాదు. ఆహార అలవాట్ల నిచ్చెనను మేధోపరమైన విమర్శకు గురిచేసి, బహిరంగ ప్రదేశాలలో పెద్దకూరని తినే ప్రతీకాత్మక చర్యలను చేపట్టి పెద్దకూర తినటం పట్ల ఉన్న 'కళంకా'న్ని, చెదరగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

**బీఫ్‌స్టాల్ ఏర్పాటుకు డిమాండు :**

హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జరిగే సుకూన్ పండుగలో బీఫ్‌స్టాల్ పెట్టడం కూడా ఈ రకమైన కళంకాన్ని చర్చకు పెట్టి, దాన్ని ఎండగట్టడంలో భాగమే. ప్రతి విద్యా సంవత్సరం చివరలో అందరు విద్యార్థులకు ప్రాతినిధ్యం వహించే విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం మూడురోజుల సుకూన్ పండగను నిర్వహిస్తుంది. విద్యార్థుల కోసం రకరకాల పోటీలు – నాటకాలు, క్విజ్‌లు, చర్చ, సంగీతం, నాట్యం, ఆటలు – దీనిలో భాగం. అక్కడ ఏర్పాటు చేసే ఆహార స్టాళ్ళలో ప్రధానంగా ఉండేది శాకాహారమే. మాంసాహారం వున్నా, అది కోడి మాంసానికే పరిమితం.

పండగలంటేనే ప్రత్యేక సందర్భాలు. ఈ సమయంలో తమ తమ ప్రత్యేక సంస్కృతికి సంబంధించిన వంటకాలను, ఆహారాన్ని తినటానికి చాలా మంది ఇష్టపడతారు. 'కేంద్రీయ' విశ్వవిద్యాలయంలో పేరుకి తగ్గట్టే ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయేతర సిబ్బంది దేశంలో నలుమూలల నుండీ వస్తారు. విభిన్న సంస్కృతులు, ఆహార అలవాట్లు కలిగి ఉంటారు. దళిత విద్యార్థులు, ముఖ్యంగా దక్షిణ భారతదేశం నుండి వచ్చిన దళితులు, పెద్దకూర నిష్టపడతారు. ముస్లింలు మటన్ బిర్యానీని, ఆదివాసీ విద్యార్థులు, ఈశాన్య భారత దేశం నుండి వచ్చిన విద్యార్థులు పంది మాంసాన్ని కోరుకుంటారు. ఇదంతా పక్కనపెట్టి ఒక్క ప్రత్యేక సంస్కృతికి చెందిన ఆహారాన్ని మాత్రమే పండుగ సందర్భంలో అందచేయటం వైవిధ్య సంస్కృతిపై ఆ ప్రత్యేక సంస్కృతికున్న ఆధిపత్యాన్ని తెలుపుతుంది.

2006 సంవత్సర సుకూన్ పండగ జరిగే కొన్ని నెలల ముందు విశ్వవిద్యాలయంలోని దళిత విద్యార్థి సంఘం ఈ ఆధిపత్యాన్ని వ్యతిరేకించింది. సుకూన్‌లో అందిస్తున్న ఆహారం యూనివర్శిటీ సమూహంలోని ఆహార అలవాట్ల వైవిధ్యతను ప్రతిబింబించట్లేదని, కేవలం అగ్రకుల సంస్కృతినీ, ఆధిపత్యాన్నీ సూచిస్తోందనీ వాదించింది. విశ్వవిద్యాలయం ఒక సార్వజనీన సంస్థ కాబట్టి, ఆ సంస్థ కల్పించే స్పేస్‌ను ఒకే సంస్కృతి వలసీకృతం చేసుకోకూడదనీ, విశ్వవిద్యాలయ సమూహంలోని ప్రతి సంస్కృతికీ అందులో సమానస్థానం ఉండాలని చెప్పింది. భారతదేశంలోని పలు సంస్కృతులకు ఆ పండుగలో ప్రాతినిధ్యం లభించాలి. అటువంటి సమాన ప్రాతినిధ్యానికి మొదటి అడుగ్గా సుకూన్‌లో పెద్దకూర దుకాణం పెట్టుకునేందుకు అనుమతివ్వాలని డియస్‌యు కోరింది. పెద్దకూర దళితుల ఆహారంలో మాత్రమే కాదు, ముస్లింలు, కొంత మంది అగ్రకుల హిందువుల అలవాట్లలో కూడా భాగమే. విశ్వవిద్యాలయ కార్యనిర్వహణాధికారులు మాత్రం ఈ అభ్యర్థనతో చిరాకుపడి, విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బీఫ్ తినటం వల్ల కుల, మత ఘర్షణలు చెలరేగుతాయి అనే కారణం చూపుతూ అనుమతిని నిరాకరించారు.

ఇది పూర్తిగా అసంబద్ధవాదన. పెద్దకూర తినటం వల్ల కుల, మత ఘర్షణలు చెలరేగుతాయని ఎవరైనా ఏ ఆధారంతో చెప్పగలరు? విశ్వవిద్యాలయ ప్రాంగణం బయట బీఫ్ తిన్నప్పుడు ఘర్షణలు చెలరేగట్లేదు కదా? పోనీ బీఫ్ తినేవాళ్ళు, తిననివారి మధ్య గొడవలున్నాయా, అంటే అవీ లేవు. దళిత విద్యార్థి సంఘం, విశ్వవిద్యాలయ అనుమతి నిరాకరణని, దళిత సంస్కృతి తిరస్కరణగా అర్థం చేసుకుని, ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా నిలబడి, విద్యార్థులను కూడగట్టి బలమైన నిరసన వ్యక్తం చేసింది.

విశ్వవిద్యాలయ విద్యార్థులు, బీఫ్ స్టాల్ సమర్థకులు, వ్యతిరేకులుగా నిట్టనిలువున చీలారు. విద్యార్థి సంఘాలన్నీ దళిత విద్యార్థి సంఘాన్ని సమర్థించాయి, భారతీయ జనతా పార్టీకి చెందిన అఖిల భారత విద్యార్థి సంఘం తప్ప. ఆ సంవత్సరం, దళితుల సాంస్కృతికాభివృద్ధిని సమర్థించే మార్క్సిస్టు స్టూడెంటు సంఘమైన ఎస్ఎఫ్ఐ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో గెలిచి దానికి సారధ్యం వహిస్తోంది. సంఘం ప్రెసిడెంటు, విశ్వవిద్యాలయ కార్యనిర్వహణాధికారుల నిర్ణయాన్ని కాదని, పెద్దకూర స్టాల్‌కు అనుమతినిచ్చాడు. ఈ నిర్ణయం కొంత మందికి అంతులేని ఆనందాన్ని, మరికొంత మందికి దు:ఖాన్ని కలిగించింది. దుకాణం దగ్గర దళిత విద్యార్థులు, వారి సమర్థకులు అంబేద్కర్‌కు జై కొడుతూ స్లోగన్సిచ్చి, చప్పట్లతో, మాదిగ డప్పు దరువుకు నాట్యం చేస్తూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ, పెద్దకూరని ఆస్వాదిస్తూ పండగ జరుపు కున్నారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ దీన్నంతా 'కాంపస్ ట్రాజెడీ' అని 'భారతీయ సంస్కృతికి దెబ్బ'గా పేర్కొంటూ, స్టాల్‌కు వ్యతిరేకంగా గొడవ చేసి 'పెద్దకూర తినటం భారతీయ సంస్కృతికీ, అత్యధిక శాతం విద్యార్థుల సెంటిమెంటుకు వ్యతిరేకం' అంటూ వెంటనే దీనిని తొలగించాలని బలంగా కోరింది.

ఇటువంటి సాకు కోసమే ఎదురుచూస్తున్న విశ్వవిద్యాలయ బాధ్యులు స్టాల్ దగ్గరకు పరుగెత్తుకొచ్చి కాంపస్‌లో గొడవకు దారితీస్తున్న కారణంగా వెంటనే స్టాల్‌ను మూసేయాలని హుకుం జారీ చేసారు. దళిత విద్యార్థి సంఘం, ఎస్ఎఫ్ఐ,

అంబేద్కర్ విద్యార్థి సంఘం, అన్నీ కలిసి దీన్ని గట్టిగా వ్యతిరేకించాయి. దళితుల ఆహార అలవాట్లు హిందూ అగ్రకుల ఆహార అలవాట్లకంటే భిన్నమైనవనీ, ఆ తేడాలు సుకూన్ పండగలో అందించే ఆహార పదార్థాలలో ప్రతిబింబించాలనీ వాదించారు. వారి వాదనలోని తర్కాన్ని చూసో లేక స్టాల్‌కు అధిక శాతం విద్యార్థుల సమర్థన ఉందని గమనించో గానీ విశ్వవిద్యాలయ కార్యవర్గం మొత్తానికి కళ్ళు తెరిచి విషయాన్ని అర్థం చేసుకుంది. అమలులో ఉన్న స్థానిక, జాతీయ చట్టాలను పరిగణనలోకి తీసుకుంటూ దళిత విద్యార్థి సంఘానికి పెద్దకూర స్టాల్‌ని పెట్టుకోవటానికి అనుమతినిస్తూ సాధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

**తమ మానవాధికారాన్ని నిలబెట్టుకోవటం:**

సార్వజనీన (పబ్లిక్ స్పేస్) స్థలాల్లో పెద్దకూర స్టాల్‌ను పెట్టటం ద్వారా దళిత విద్యార్థి సంఘం బహిరంగ ప్రదేశాలలో హిందూత్వ సంస్కృతి ఆధిపత్యాన్ని ప్రశ్నించటమే కాక, పక్కకి నెట్టబడిన అనేక సమూహాలు, సంస్కృతులకు అక్కడ ప్రవేశించటానికి అవకాశాలు కల్పించింది. రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులను పొందటమే కాదు; రాజ్యాంగం కల్పించిన న్యాయఅవకాశాలను హిందూత్వ కుల సంస్కృతి తమ గుప్పెట్లోకి తెచ్చుకోకుండా కాపాడింది...

దళిత విద్యార్థులెదుర్కున్న తిరస్కృతి వారినవమానపరచటమే కాక వారి మానవత్వాన్ని కూడా గాయపరుస్తుంది. సంజయ్ పాల్షికర్ మాటల్లో చెప్పాలంటే "ఒకరిని (కించపరచమంటే) అవమానానికి గురి చెయ్యటమంటే, కావాలని, అన్యాయంగా వేరే వారితో పోల్చి వారిని నీచంగానూ, తక్కువ చేసి చూపించటం; అత్యంత బాధాకరమైన అనుభవమది. తేలిగ్గా మరిచిపోలేనిది కూడా. రోజూ ఇటువంటి అనుభవాలనెదుర్కునే వారి ఆత్మస్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తుంది". మార్గరేట్ మాటల్లో 'అవమాన పరచటం, ఒక మనిషిని మనిషిలా పరిగణించక పోవటం: వారి మానవత్వాన్నే కించపరిచే చర్య. దీనిలో అవలంబించే పద్ధతేంటంటే, వారిలోని ఏదో ఒక శారీరక/భౌతిక అంశాన్ని వారి మానవత్వంలో లోటుకి చిహ్నంగా చూడటం. అగ్రకుల హిందువులు దళిత డప్పును, ఆహారాన్ని, ముఖ్యంగా పెద్దకూరని తక్కువచేసి, అంటరాని దానిగానూ చూపటం – దాని సాకుతో వారిని సమాజ నియమాలని ఉల్లంఘించే వారిగా, లోపభూయిష్టమైన మానవులుగా, లేదా తక్కువ రకం మానవులుగా చూడటం జరుగుతుంది.

ఇక్కడ ప్రధానమైన ప్రశ్న – అవమానానికి గురయిన వాళ్ళు తమ మానవత్వాన్ని తిరిగెట్లా పొందుతారు అనేది. ప్రతీకారం, ప్రతిహింస, క్షమించటం అనే మూడు మార్గాల ద్వారా ఇది సాధ్యమని పాల్షికర్ అంటారు. వీటి సాధ్యాసాధ్యాలనిప్పుడు నిశితంగా పరిశీలిద్దాం.

అవమానపరిచిన వారిని తిరిగి అవమానపరచటం ద్వారా ప్రతీకారం తీర్చుకోవటం దళితులకు సాధ్యమేనా? ఉదాహరణకి దళితులను బీఫ్ తింటున్నారని అవమానిస్తే, అగ్రకులాలను వారి ఆహార అలవాట్లు, వారి జీవనశైలి గురించి కించపడేట్టు చేయొచ్చా? బ్రాహ్మణులను 'పప్పుగాళ్ళు', 'జంధ్యంగాళ్ళు', 'తాడుగాళ్ళు', కోమట్లను 'చింతపండుగాళ్ళు' అని దళితులు, మిగిలిన తక్కువ కులాలు చేసే కామెంట్లు కొంతమేరకు ఈ ప్రయత్నంలో భాగమే. దళితులే కాక, మిగిలిన అగ్రకులాల వారు కూడా ఇటువంటి పదాలు వాడతారు. అయితే ఇవి పెద్దగా బాధపెట్టేవి, అవమానపరిచేవి కావు. జంధ్యం, పప్పు అగ్రకులాలకి చెందటం వల్ల సమాజంలో వాటిని అనుకూల అంశాలుగానే చూస్తారు. అంతేకాక ఉన్నత సామాజిక స్థానంలో ఉన్న బ్రాహ్మణులు, వైశ్యులు ఇటువంటి చిన్నపాటి వ్యాఖ్యలను పెద్దగా పట్టించుకోరు.

ప్రతీకారేచ్ఛ చక్రబర్తి చెప్పినట్లు అవివేకమయింది కాదూ? ప్రతీకారం చేపట్టిన వారేం చేసినా అసలు దాడికి సరి సమానం కాదు. ప్రతీకారం హింసనింకా ప్రేరేపిస్తుంది తప్ప తగ్గించదు. అంతేకాక, నైతికంగా, రాజకీయంగా అది ఓటమిని సూచిస్తుంది కానీ విజయాన్ని, బలాన్ని కాదు.

ప్రతీకారం సరైన పరిష్కారం కాదనుకుందాం. మరి బాధితులు పాత గాయాల జ్ఞాపకాల బాధను, దాన్నుండి ఉద్భవించే ద్వేషాన్ని ఎలా ఎదుర్కోవాలి? 'గుర్తు' పెట్టుకుంటూ 'వ్యతిరేకించ'మనే చక్రబర్తి సలహా ఎంత వరకు సాధ్యం? జరిగిన హింసను. అవమానాన్ని పదే పదే 'గుర్తు' చేసుకోవటం బాధితులను నిరంతర మానసిక వేదనకు గురి చేస్తుంది. రెట్టింపు బాధకు గురి చేస్తుంది: ఆ అనుభవానికి గురయిన బాధ + దాన్ని జ్ఞాపకాల్లో పొందుపరచుకున్న బాధ. ఈ రకంగా తమపై హింసను వ్యతిరేకించటం కూడా ఈ సందర్భంలో సమస్య కొనసాగింపుగానే పరిణమిస్తుంది. సమూలమైన పరిష్కారాలు తప్ప తాత్కాలిక ఉపశమనాలు ఈ సమస్యకి పనికిరావు. జ్ఞాపకంలో బాధను పొందుపరచుకుంటూ హింసను వ్యతిరేకించటం నా ఉద్దేశంలో సమస్యను పక్కదోవ పట్టించటమవుతుంది కానీ శాశ్వత పరిష్కారం కాదు.

పాల్షికర్ సూచించిన రెండవ పరిష్కారానికొద్దాం. అవమానాల్ని ఎదుర్కునే క్రమంలో ప్రతి హింసకి పాల్పడటం కూడా సమస్యాపూరితమే. మానవ జీవితాలని, వనరులని నాశనం చేసే ఏ హింసయినా నాగరికతను వెనక్కు నెడుతుంది. సంఖ్యాపరంగా కులాలన్నీ చిన్నవే అయినా, దళితులకి వ్యతిరేకంగా హిందూ కులాలన్నీ కలిస్తే, అవి జనాభాలో 65 నుండి 70 శాతం వరకూ ఉంటాయి. దళితులు జనాభాలో 22 నుండి 24 శాతం మాత్రమే ఉంటారు. అగ్రకుల హిందువులకి సంఖ్యాబలమే కాక అన్ని రకాల బలమూ ఎక్కువే. వారు హింసాయుతంగా ప్రతిఘటిస్తే దళితులు అమితంగా నష్టపోతారు. అంతేకాదు, హింసాయుత మార్గం చేపట్టటమంటే ఇరువర్గాల మధ్య చర్చలకూ, సంభాషణకూ దారులు మూసుకుపోయాయనీ. అవకాశం లేదనీ ఒప్పుకోవటమన్నమాట.

కుల దురాగతాలని ఎదుర్కోవటానికి పాల్షికర్ సూచించిన మూడవ మార్గం క్షమాపణ. దానికోసం దురాగతాలకి పాల్పడిన వారు మనసు మార్చుకుని తమ చర్యల పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేయాలి. కుల సమాజం నుండి ఎప్పటికయినా ఇటువంటి స్పందన వస్తుందా అన్నది సందేహాస్పదమే. హిందువులు బలంగా విశ్వసించే కర్మ సిద్ధాంతం ప్రకారం పూర్వజన్మలో చేసిన పనుల వలనే ఈ జన్మలో ఏ కులంలో పుడతారన్న నిర్ణయం జరుగుతుంది. పూర్వ జన్మలో చేసిన మంచి చెడు కర్మల ఫలితం బట్టి ఈ జన్మలో అగ్రకులాలలోనో, నిమ్న కులాలలోనో పుడతారు. అగ్ర కులంలో పుట్టిన హిందువులు తాము దళితులపై జరిపే హింస, అవమానాలను తమకు పూర్వజన్మ సుకృతాల ఫలితంగా ఈ జన్మలో లభించిన హక్కుగానూ, దళితులు పూర్వజన్మలో చేసుకున్న పాపాలకి ఫలితంగా వారీ జన్మలో అనుభవించాల్సిన శిక్షగానూ అర్థం చేసుకోవటానికి చాలా అవకాశాలున్నాయి. ఇటువంటి భావజాల నేపథ్యంలో అగ్రకుల హిందువులు ఎప్పటికైనా తమ చర్యల గురించి పశ్చాత్తాప పడతారా అనేది పెద్ద ప్రశ్న.

నా ఉద్దేశంలో దళితులెదుర్కునే అవమానాలకి ఇవేవీ సరైన పరిష్కారాలు, ప్రతిస్పందనలు కావు. కాబట్టి రెండు కొత్తవిప్పుడు ప్రస్తావిస్తాను. మొదటిది, అవమాన కారకాలయిన సాంప్రదాయాలు, అలవాట్లని పూర్తిగా వదలేయటం, రెండవది, వాటినే యోగ్యమైనవని బలంగా చెప్తూ వాటి గురించి గర్వపడటం.

మొదటి ప్రతిస్పందన సాధ్యాసాధ్యాలను పరిశీలిద్దాం. బీఫ్ తింటున్నారనే నెపంతో దళితులెదుర్కునే అవమానాలు, వారు బీఫ్ తినటం మానేస్తే ఆగుతాయనీ, వారిని అందరూ మనుష్యులుగా పరిగణిస్తారనే గారంటీ లేదు. శాకాహారులుగా ఉన్న దళితులను అవమానించిన సందర్భాలు కోకొల్లలు. పెద్దకూర తినటం మానేస్తే దళితులు తమను తామే అవమానించుకున్నట్లవుతుంది. తమ ప్రయోజనాలకు వ్యతిరేకంగా, ఇతరుల అధికారాన్ని బలపరిచే ఈ చర్య వల్ల దళితుల ఆత్మగౌరవం దెబ్బతింటుంది.

రెండవ మార్గానికొద్దాం : మన సాంప్రదాయాలు, అలవాట్లు మంచివని ఉద్ఘాటిస్తూ గర్వపడటం. మనం వాటికెంత విలువిస్తున్నామో దీని వల్ల అందరికీ తెలుస్తుంది. మనం బీఫ్ తిన్నందుకు సిగ్గుపడకపోయినా అగ్రకుల సమాజం మనని సిగ్గుపడేటట్టు చేస్తుంది. బహిరంగ ప్రదేశంలో బీఫ్ స్టాల్ పెట్టటం వల్ల దళితులు తమ ఆహార అలవాట్లు మంచివని, గర్వించదగ్గవని చెప్పటమే కాక, కుల హిందువులకి ఈ ఆహారం రుచి చూసి, తమ భావాలను మార్చుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు. కుల సమాజ బాధితులు, తమ నవమానించే వారు ఆశించినట్లు కాకుండా, తమ మార్గాన్ని తామే ఎంచుకుంటున్నారన్నమాట. పెద్దకూర తినటానికున్న విలువను దళితేతరులు 'ఒప్పుకోకపోవచ్చు' కాక, కనీసం ఈ రకంగా అయినా తమ అభిప్రాయాలను మార్చుకుంటారేమో చూద్దాం!

**సౌత్ ఏషియా రిసెర్చ్ (29:2(2009) 127-149), జర్నల్‌లో వచ్చిన 'డెమోక్రటైజేషన్ ఆఫ్ పబ్లిక్ స్ఫియర్ : ద బీఫ్ స్టాల్ కేస్ ఇన్ హైదరాబాద్ సుకూన్ ఫెస్టివల్' కు సంక్షిప్తానువాదం**

**(ఈ వ్యాసంలో పబ్లిక్ అన్న మాటను 'బహిరంగం' అంటే ప్రైవేటు కానిది అని; 'సార్వజనీన' అంటే అందరికీ చెందవలసిందనే రెండు అర్థాలలో వాడటం జరిగింది. అనువాదంలో ఈ రెండు పదాలు వాడాము.)**

**అనువాదం : ఎ.సునీత**

# 'వెజిటేరియన్స్ ఓన్లీ'

■ స్కై బాబా

నడిచి నడిచీ కాళ్లు గుంజుతున్నై, అరికాళ్లు మంట పుడుతున్నై, పొద్దుననంగ వచ్చినం ఆ బస్తీకీ, వరుసబెట్టి గల్లీలన్నీ తిరుగుతున్నం. కనబడ్డ TOLET బోర్డు నల్లా పలకరిస్తున్నం.

ఇంక శానా గల్లీలే ఉన్నయ్. అవతలివైపు మెయిన్ బజార్ నుంచి కుడిపక్క, ఎడంపక్క గల్లీలన్నీ తిరగడం అయిపోయింది. మూడిండ్లల్ల ఒక ఇల్లు శానా బాగుంది. మేం కోరుకున్నట్లుగానే కిరాయి 1500. ఒక రూము, ఒక చిన్న కిచెన్. చాలు.. ఇంత హైదరాబాద్‌ల మేమిద్దరం ఉంటానికి. రెండు నెలల అడ్వాన్స్ ముందు ఇవ్వాలన్నడు ఓనర్. ముందు ఒక నెలది ఇస్తం సర్, చేరినంక ఇంకో నెలది ఇస్తమంటె సరె నన్నడు.

హమ్మయ్య అనుకున్నం. మూడు వేలు ఇప్పుడె కట్టాల్నంటె కష్టం. జేబులో 1500లే ఉన్నయ్. బాగనె ఒప్పుకున్నడు. ఇప్పుడె ఇచ్చేస్తె పాయె. లేకపోతె మల్ల ఎవడొ అడ్వాన్స్ ఇచ్చేస్తె సస్తిమి. ఇద్దరం గుడ అదె అనుకున్నం.

1500 తీసి ఇచ్చిన. ఓనర్ తీసుకొని లెక్కపెట్టుకుండు. 'సరె బాబు! ఎప్పుడొస్తరు?" అన్నడు.

'ఇయ్యాల్నె, సాయంత్రం కొంచెం సామాన్ తెస్తం సార్' అన్న.

'సరె! అని ఇంట్లకు పోబోయి–

'ఏం పేరు?' అన్నడు.

కొద్దిసేపే తటపటాయించిన నేను, ఇద్దరం మొఖాలు చేసుకున్నం.

ఎందుకో నా మనసు ముడుచుకుపోయింది. ఆ కొద్దిసేపు నా పేరు ఏ రమోషో, రాజేషో అయితె ఎంత బాగుండు. తప్పదు –

'యూసుఫ్!' అన్న.

ఇంటాయన షాక్ కొట్టినట్లు ఆగిపోయిండు.

'ఏందీ?' అన్నడు.

'యూసుఫ్ అండి!' అన్న. ఈ ఇల్లు గుడ క్యాన్సిల్ అని సమజై పొయింది.

'ముస్లింసా?' అన్నడు ఇటు తిరిగి నమ్మలేనట్లు.

'అవునండి. కాని మీకే ఇబ్బందీ ఉండదండి. నేను జాబ్ కెళ్లిపోతాను. తను తెలుగులోనే ఎం.ఫిల్. చేస్తున్న దండి..' ఇంకా ఏం చెప్పాల్నా అని వెతుక్కుంటున్న. అయినా నేను చెప్పినవి ఆ ఇంటాయనకు సంతృప్తిని కలిగించ వనిపిస్తనె ఉంది. ఇంకా సంతృప్తి కలిగించేలా మాత్రం మాట్లాడలేననిపించింది.

'తెలుగు బాగ మాట్లాడుతుంటె మనోల్లె అనుకున్న. ముస్లింలకైతె ఇవ్వం బాబూ! సారీ!' అనుకుంట పైసలు వాపస్ ఇయ్యబొయ్యిండు.

'సర్ ! మీ ఇల్లు మాకు బాగ నచ్చింది సర్. తిరిగి తిరిగి అలిసిపొయ్‌నం సర్. మా వల్ల మీకు ఏ ఇబ్బంది ఉండదు. ఇద్దరం చదువుకున్నోళ్లం కద సర్. ఇల్లు నీట్‌గ ఉంచుకుంటం సర్' అన్నది షాహీన్ దీనంగ.

'లేదమ్మా ! ఇంట్ల ఒప్పుకోరు'

'ఒక్కసారి అడిగి చూడండి సర్. మా గురించి చెప్పండి. మా మిసెస్‌తో మాట్లాడి చూడమనండి' అన్న నేను.

ఓనర్ నా దిక్కు ఓ చిత్రమైన చూపు చూసిండు.

'ప్లీజ్ సర్!' అన్న.

'చెప్పి చూస్త' అనుకుంట లోపలికెళ్లిండు.

హమ్మయ్య అనుకున్న. ఒప్పుకుంటె బాగుండు అనిపించింది. లోపలి మాటలు సరిగ వినిపిస్తలెవ్. 'గట్టిగ మాటలేం వినబడ్తలెవ్ గనక ఒప్పుకుందేమో!' అన్న షాహీన్‌తో మెల్లగ.

ఓనర్ బైటికొచ్చిండు.

'సారీ బాబూ! ఒప్పుకుంట లేరు.' అనుకుంట పైసలిచ్చేసిండు. మల్ల సూడకుంట లోపలికెళ్లిపొయ్యిండు.

మనసుల మల్లొకసారి ముల్లు గుచ్చుకుంది !

పైసలు జేబుల పెట్టుకొని మల్ల దిక్కులు చూస్కుంట బయల్దేరినం. ఆ బజార్లన్ని తిర్గినా నచ్చిన ఇల్లు దొర్కలె.

ఇంకో రెండిళ్లు చూసినంక లాభం లేదనుకొని, ముస్లింలకు ముస్లింలే ఇచ్చేటట్టున్నదని ముస్లింలున్న దిక్కు నడిచినం.

చింతల్‌బస్తి ప్రత్యేకత గురించి మా దోస్త్ శంకర్ చెప్పిన మాటలు యాదికొచ్చినయ్. ఇక్కడ అన్ని కులాలు, అన్ని మతాలవాళ్లుంటరట. పైగా పక్కా మాస్. ముస్లింలే కాక క్రైస్తవులు, జైనులు కూడా కనిపిస్తరట. దేశంలో నుండి హైదరాబాద్‌కి బతకడానికి వచ్చిన అన్ని రాష్ట్రాలవాళ్లు ఇక్కడ ఉంటరేమోనన్నడు.. నేపాలీలు మాత్రం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంటరట.

కూరగాయల మార్కెట్ కూడా ఉండడంతోని దొరకని వస్తువుండదట. ఇక్కడ అంగడి ఆదివారమట. అన్ని రకాల మనుషులు, ముఖ్యంగ కూలీ కార్మికులు అంగడి వస్తువులన్ని కొనుక్కుంటానికి బయల్దేరడంతోని కిటకిటలాడిపోతదట బజారు.

ఆలోచించుకుంట ముస్లిం వాడలకు వచ్చేసినం. చిన్న చిన్న ఇండ్లు, గరీబీ ఉట్టిపడుతున్నది. తలుపులు చాలా వరకు పెట్టి ఉన్నయ్. అక్కడక్కడ పర్దాలు, కొత్తగ కట్టినట్లున్న ఒక ఇంటికి 'టులెట్' కనిపించింది. పాణం లేచి వచ్చింది.

పొయ్ బెల్ మోగించినం.

'కోన్ హై?' మధురమైన గొంతు.

'టులెట్ బోర్డ్ దేఖ్ కె అయె !'

'థోడా వెయిట్ కరియే..'

'జీ !'

కాసేపటికి లుంగీ పైకి కట్టుకుంట వచ్చిండు ఓనర్. మా ఇద్దర్ని కొద్దిగ ఆశ్చర్యంగ చూసిండు.

'క్యా కర్తే?' అనడిగిండు నా దిక్కు చూస్కుంట.

'మై జర్నలిస్ట్ హు ! ఇనూ పఢ్‌రయ్. దోనో హీ రహెతె.'

'ఆప్ ఆంధ్రావాలె హై క్యా?' (మీరు ఆంధ్రావాళ్లా?)

'నహీ, క్యుం ఐసా పూఛే?' (కాదు. ఎందుకట్ల అడిగ్రు?) అన్న నేను.

'ఆప్ పర్దా నై కర్తే?' (మీరు పర్దా పాటించరా?) నన్నసలు పట్టించుకోకుండా, షాహీన్ దిక్కు కాస్త చికాకుగా చూస్కుంట అన్నడతను.

'నై' (లేదు) అన్నది షాహీన్ మామూలుగా

'క్యు !' (ఎందుకని)

'ఐసీ హీ !' (మామూలుగనే) అన్నది షాహీన్.

'ఆప్‌జైసె లోగోంకొ హమ్ ఘర్ నహీ దేతే !' (మీలాంటి వాళ్లకు మేం ఇల్లు ఇవ్వం) అన్నడతను నిర్లక్ష్యంగ గోడకానుకొని నిలబడుకుంట.

అంతే నిర్లక్ష్యంగ ఏదన్న అనాలనిపించింది నాకు. క్షణాల్లో నిగ్రహించుకున్న. షాహీన్ తట్టుకోలేక ఏదో అనబోతుంటె వద్దన్నట్లు తన చేయి నొక్కి –

'పోదాం పా!' అనుకుంట ముందుకు నడిచిన

అతను షానా నిర్లక్ష్యంగ చూస్తున్నడు. ఆ చూపును కాల్చెయ్యాలన్నంత కోపాన్ని, అలజడిని గుండెల్లో అణచి పెట్టుకొని రోడ్డు మీది కొచ్చినం.

'లాభం లేదు. మనకు ముస్లింలు కూడా ఇల్లివ్వరు. నాన్ ముస్లింస్ ఇళ్లల్లోనే వెతకాలి. నువ్వు బాగా అలిసిపొయ్‌నవ్. రూం కెళ్లిపో. నేను ఏదో ఒకటి చూసి వస్త' అని చెప్పి షాహీన్‌ను పంపేసిన.

మల్లా ఇంకోదిక్కు బయల్దేరిన. ఇందాకటి లాంటి సంఘటనే మరొకటి గుర్తొచ్చింది –

హైస్కూల్లో మా బ్యాచ్‌మేట్, నాకు దూరపు బంధువు

ఇబ్రహీం వచ్చిండొకసారి మా రూంకు. అప్పుడు సైదాబాద్‌లో ఉంటున్నం. రాత్రి అన్నం తినుకుంట మాటల సందర్భంలో పిసల్‌బండలోని వాళ్ల అత్తగారింట్లో ఒక పోర్షన్ ఖాళీ ఉందన్నడు. మేం వస్తం అడగమన్న. దానికి వాడన్నమాటకు షాక్ అయ్‌నం. 'మా అత్తగారోళ్లు పర్దా, బుర్ఖా వెయ్యనివాళ్లకు ఇవ్వరు !'

అది గుర్తొచ్చి ఇంకా బాధేసింది.

***

రెండో మెయిన్ బజారుకొచ్చి మొదటి గల్లీలకు జొరబడ్డ. ఒక దిక్కు ఇండ్లన్ని రెండంతస్తులు, మూడంతస్తులున్నై. ఇంకో దిక్కు అన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లే. అట్ల గ్రౌండ్ ఫ్లోర్‌లె ఉన్న ఇండ్లంటెనె కిరాయికి ఇయ్యరని అర్థం. గీ మొదటి దిక్కే పైకెల్ల చూస్కుంట పోతున్న. నాలుగో ఇంటి రెండు అంతస్థుకి టులెట్ బోర్డు కనిపించేసరికి హుషారొచ్చింది.

గేటు కాడ ఆగి అటు ఇటు చూసిన. గేటు తీసి లోపలికెళ్తె పైకి మెట్లున్నకాడ కాలింగ్‌బెల్ కనిపించింది. కొట్టి వెనక్కొచ్చి పైకి చూస్కుంట నిలబడ్డ.

మొదటి అంతస్తు నుంచి ఒకామె బైటికొచ్చింది. 'ఏం బాబూ?' అన్నది.

'టులెట్ గురించి మేడం' అంటు బోర్డు దిక్కు చూపెట్టిన.

'మీరు వెజ్‌టేరియన్సా? నాన్ వెజ్‌టేరియన్సా?' అని అడిగిందామె.

షాక్ కొట్టినట్లయ్యింది నాకు. అంత స్ట్రెయిట్‌గ అట్లాంటి క్వశ్చన్ ఎదురుకావడం అదే మొదలు. ఏం చెప్పాల్నో కొన్ని క్షణాలు సమజ్ కాలె. అబద్ధం ఎట్ల చెప్తం? సత్యహరిశ్చంద్రులం కదా!

'నాన్ వెజ్‌టేరియన్స్ మేడమ్!' అన్న.

'సారీ!' అవతల్నుంచి ఠపీమని జవాబు పడడమే కాక ఆమె వెంటనే లోపలికెళ్లిపోయింది కూడా.

సిగ్గేసింది – నా మీద నాకో... ఈ లోకం మీదో..! చుట్టూ చూసిన హమ్మయ్య ఎవరూ లేరు అనుకొని భారంగ ముందుకు కదిలిన..

అంటె ఆమె అర్థం ఏమిటి? ముస్లింలకు ఇవ్వరనా? కాదు కదా.. ఎవరైనా నాన్‌వెజ్‌టేరియన్స్‌కి ఇవ్వమని. అంటె వీళ్లెవరై ఉంటరబ్బ? కేవలం వెజ్‌టేరియన్స్ ఎవరబ్బా? చాలా తక్కువ మంది ఉంటరే..! అంటె వీళ్లు వాళ్లా? అసలు నాన్‌వెజ్‌టేరియన్స్ అంటె ఎవరెవరు? ముస్లింలు – పక్కా మాంసాహారులు. తర్వాత క్రైస్తవులు? కావచ్చు. దళితులు. బీసీలు – దాదాపు అందరూ. మిగిలింది వైశ్యాస్, బ్రాహ్మిన్స్! అయితే ఈ రెండు కమ్యూనిటీస్‌లోంచి ఉండి ఉంటారు వీళ్లు. అంటె వీళ్లు వాళ్లకే ఇస్తరా? అబ్బ! ఎంత తెలివి మీరిపోయారు జనం. ఒక్క ప్రశ్నలో ఎన్ని అర్థాలో..! ఒకే ఒక దెబ్బతో అందర్నీ కొట్టేయొచ్చు. ఓఫ్!

ఇంకో టులెట్ కనిపించింది. ఆశగ చూసిన. టులెట్ కింద ఇంకా ఏందో రాసి ఉంది. ఏందబ్బా అనుకుంట దగ్గరికెళ్లిన. ఓన్లీ వెజ్‌టేరియన్స్! బాప్‌రే! ఇది డైరెక్ట్ స్పీచ్! అడుగుడు కూడ లేదు. చలో జావ్ అంటుందా బోర్డు.

అ గల్లీ లాభం లేదనుకొని పక్క గల్లీలకు మల్లిన.

***

తిరిగి తిరిగి ఒకచోట గల్లీ వొదిలేసి ఇండ్ల గుంపు మధ్యలో కొచ్చిన.

ఇండ్లు శాన ఉన్నై కాని ఒక్క బోర్డు కనిపిస్తలె. ఒక అరుగు మీద కూసొని ఆకువక్క నములుతున్న ముసలమ్మ కనిపించి దగ్గరికెళ్లి అడిగిన.

'అవ్వా! ఇక్కడ కిరాయిండ్లు దొర్కుతయా?' అని.

'గా ఇంట్ల ఉంది కొడ్కా' అని కమ్మగ చెప్పింది అవ్వ.

ఆ ఇంటి కెళ్లి తలుపు కొట్టిన. పక్కన చిన్న గేటుంది. కొద్దిసేపు చూసి మల్ల కొట్టిన. ఇంటి మూలన బోరింగ్ ఉంది. ఎవరో ఒక పిల్ల వచ్చి ప్లాస్టిక్ బిందె పెట్టి బోరింగ్ కొట్టుకుంట నా దిక్కే చూస్తుంది. క్రాపు సరిచేసుకుంట తలుపు దిక్కు విసుగ్గ చూసిన.

తలుపు ఇంకా తెరుస్తలేరేందని మల్ల కొట్టబొయిన. తలుపు తెరుచుకుంది. మాయల పెట్టె తెరుచుకున్నట్టు. తెల్లగ దొడ్డుగ ఉన్న ఆ ఇంటామె ఏందన్నట్టు చూసింది.

'కిరాయికి రూమ్స్ ఉన్నయంట కదండీ' అన్న.

'ఆ.. ఉన్నయ్! బ్యాచిలర్సా?' అన్నదామె.

'లేదండి, ఫ్యామిలి. ఇద్దరమే ఉంటం'.

'జాబ్ చేస్తరా?'

'అవునండి.'

'గేట్ల నుంచి రండి' అంటూ ఆమె తలుపు పెట్టేసుకుంది.

హమ్మయ్య ఈమెకు నమ్మకం కుదిరింది. రూమ్స్ బాగుంటె చాలనుకుంట గేటు దిక్కు కదిలిన. గేటు తీసుకొని లోపలికెళ్లంగనే ఆమె పైకి దారి తీసింది. ఆమె వెనకే మెట్లెక్కిన.

'ఇప్పుడెక్కడుంటున్రు?' అడిగిందామె.

'ఎర్రమంజిల్–బాలపురల ఉంటున్నమండి' అన్న.

ఆమె తాళం తీసి 'చూడండి' అన్నది పక్కకు జరిగి. లోపలికెళ్లిన. ఒకటే అర్ర. సింక్ కూడ లేదు. అదే అడిగిన. అర్రల ఒక మూల చూపెట్టిందామె, కింద మోరి ఉన్నదని, అక్కడ కింద జాలి ఉంది. అక్కడ కడుక్కోవాలన్నది. తలుపు పక్కనె బాత్‌రూం. దాని తర్వాత లెట్రిన్. పర్వాలేదనుకున్న. మల్ల డౌటొచ్చి –

'ఇవి మా కొక్కరికే కదా' అన్న.

'అవతల ఇంక రెండు ఫ్యామిలీ లున్నయ్. అందరికి కలిపి' అన్నది.

బాప్‌రే అనుకున్న. అవతల ఉన్నవాళ్లు బాత్‌రూంకి, లెట్రిన్‌కి మా రూం ముందుకు రావడమంటె.. భరించడం కష్టమే ననిపించింది. కాని ఏం చేస్తం, అవాళ డేట్ 30. రేపు ఖాళీ చెయ్యాలి అక్కడ.

'సరేనండి. కిరాయి ఎంత?' అన్న.

'15 వందలు' అన్నదామె.

ఇంకేమన్న అంటదేమోనని చూసిన. అడ్వాన్స్ రెండు నెలలు అంటలేదు. ఖుషీ..ఖుషీ! ఎట్లన్న సర్దుకుపోవాలె అనుకున్న.

'రేపు రావచ్చా?' అన్న.

'ఏంటోల్లు మీరు?' అన్నదామె ఎనకాముందాడకుండ.

గుండెల్లో రాయి పడ్డది. ఈ ఏంటోళ్లేందిరా బాబూ! ఏంటోళ్లయితె ఈ లోకానికెందుకంట. మేం మనుషులం అని గట్టిగ అరవబుద్ధయింది. కాని ఆమెకు అవన్నీ అర్థం కావు. పాపం, ఈ ఇంటికి రెడ్డోళ్లో, బాపనోళ్లో రారనుకుంట. మేం రెడ్డోళ్లం అనడానికి ఏతత్తరపాటు ఉండదు కదా.. ముస్లిం అనడానికే ఇంత ఇబ్బందొచ్చిందా? మాదిగోళ్లం, మాలోళ్లం, సాకలోళ్లం అని చెప్పాల్సొచ్చినా ఇంతేనేమో..!

'మేం ముస్లింసండీ, మా భార్య తెలుగులోనే ఎం.ఎ చదివింది. మీకు ఇబ్బందీ ఉండదు..' ఇంకా ఏదో చెప్పబోతున్న.

'పెద్దకూర తింటరా?'

మళ్లొక బాంబు పేల్చిందామె!

బాప్‌రే! దీనికి జవాబు చెప్పడం కష్టం. అయినా తప్పదు. తింటామంటె ఖచ్చితంగ 'నో' అంటుంది. ఇప్పుడెట్లా? ఇప్పటికె ఒకసారి తప్పనిసరై అబద్ధం చెప్పిన. ఇంతకుముందున్న ఇంటోళ్లు గుడ ఇట్లనె అడిగితె మరోమార్గం లేక తల అడ్డంగ ఊపిన. నెల తర్వాత ఆవు మాంసం తీసుకుంట ఇంటాయన కండ్లల్ల పడ్డ. ఏం చేస్తం, అదే చీపు! అవాల ఎన్ని తిట్లు తిట్టిన్రో వాళ్లు. వెంటనే ఇల్లు ఖాళీ చెయ్యమన్నరు. ఇజ్జత్ పొయ్యింది. ఆ బజారంత తెలిసిపొయ్యింది. వాళ్ల గొల్లోల్లు, ఒకడైతె కొట్టకొట్టొచ్చిండు. ఏందమ్మా ఈ బాధ అని దబ్బున దొరికిన ఏదో ఒక ఇంట్లకు, దూరమైనా – కిరాయి ఎక్కువైనా మారిపోవాల్సి వచ్చింది.

ఇప్పుడు మల్ల అదే ప్రశ్న. ఫ్చ్. ఈ దునియాతోని పొసగడం కష్టం. మేం ఏం తింటె వీళ్లకేందిరా నాయనా..ఛత్ ! ఇప్పుడేం చెయ్యాలె..?!

'పెద్దకూర ఎప్పుడో ఒకసారి తింటమమ్మా! మీరు తినొద్దంటె తినం. మాకు ఇల్లు కావాలమ్మా. పొద్దట్నుంచి తిరుగుతున్న' దీనంగ బతిలాడిన.

'పెద్దకూర తినేటోళ్లకు ఇయ్యం' అనేసి రూంకు తాళం వేస్తున్నదామె. ఇంకేమనాలో సమజ్‌కాక నిలబడిపొయ్‌న. అప్పటికే మనసు చంపుకొని మీరు తినొద్దంటె తినం అంటి. ఛ. అంతగనం లొంగడం అవసరమా?! 'ఆవుకూర ప్రపంచమంతట తింటరు తల్లీ!' అందామనిపించింది.

ఆమె నా దిక్కు చూడగుడ చూడకుంట మెట్ల దిక్కునడిచింది. తప్పదన్నట్లు నేన్ గుడ నడిచిన.

ఇగ ఆ ఇండ్లన్ని దండగనిపించింది. ఇందాకటి పిల్ల బోరింగ్ ధన్నధన్న కొట్టబట్టింది. నన్ను చూసేనేమో అనిపించింది.

***

రోడ్డు మీది కొచ్చిన. ఎదురుంగ అటుదిక్కు గల్లీ కన్పించింది. అటు దిక్కు పొయ్న. ఎదురుంగ ఓ రెండంతస్తుల ఇంటికి టులెట్ బోర్డు! దబదబ ఆ ఇంటి తలుపు దగ్గరికెళ్లి చూసిన. తలుపు తీసి ఉంది. పక్కనె మెట్లున్నయ్. అప్పుడె మెట్లు దిగిపోతున్న ఒకామె ఏందన్నట్లు చూసింది. 'కిరాయి ఇల్లు ఉన్నట్లు బోర్డు పెట్టిన్రు కదా' అన్న. 'పైన ఓనరున్నడు, అడుగురి' అనుకుంట వెళ్లిపోయిందామె. మెట్లెక్కి పైకి పొయ్న. ఒక భారీ మనిషి ఎదురుపడ్డడు. చదువుకున్న మనిషి లాగున్నడు.

'సార్! కిరాయికి రూమ్స్..?

'ఎందరుంటరు?'

'భార్యాభర్తలం ఇద్దరమే సార్.'

'రెంట్ 2200. అందులోనె కరెంటు, నల్లబిల్లు.' అనుకుంట తాళం తీసి చూపెట్టిండు. ఒక పెద్ద రూమ్. ఒక కిచెన్. అటాచ్డ్ బాత్‌రూం. చాలా బాగుందనిపించింది. కాని కిరాయే 2200 అంటె కష్టం కదా..

"సార్! కిరాయి ఏమన్న తగ్గించండి సార్. మా మిసెస్ ఇంకా చదువుతుంది సార్..'

'ఆ ! ఇంత ఇల్లు నీకు 2500కు తక్కువ రాదయ్యా ఈ ఏరియాల. అదిగాక నేను అడ్వాన్స్ కూడ అడుగుతలేను. వేరే వాళ్ళయితే 2 నెలల అడ్వాన్స్ అడుగుతరు.'

'నిజమే సార్, కాని నా ఒక్క సాలరీలో కష్టమవుతుంది సార్, 1800 అయ్‌నా చేయండి. అంతకైతె ముందు ముందు పెంచుదురుగాని..' అన్న.

'అట్లంటె ఎట్ల బాబు?' అనుకుంట కొద్దిగ ఆలోచించుకుంట 'సరె, 2000 ఇవ్వు పో. అమ్మాయి చదువుతుందన్నవ్ కదా.. ఇగ ఇంతకన్న తక్కువ నీకు ఎక్కడ దొరకదు'

ఎట్ల? ఇల్లేమో బాగుంది. ఓనరు మంచోడి లెక్కుండు. కాని 2000 కట్టగలనా? కడితె ఎట్ల బతకడం? కష్టమె. కాని తప్పదు. టైం కూడ లేదు..

'సరె సర్, కాని ప్రస్తుతం 1500 లే జేబులో ఉన్నయ్ సర్. ఇదిగోండి. మిగతా 500 రెండు రోజుల్లో ఇస్త సర్'

'ఓ.కె. ఎప్పుడు దిగుతరు?' అన్నడు పైసలు లెక్కపెట్టుకుంట.

ఎగిరి గంతెయ్యబుద్ధయింది నాకు, 'రేపె సార్' అన్న.

'చదువుకున్నోళ్లంటె నాకు ఇష్టమయ్య, ఇద్దరె ఉంటరు కాబట్టి ఇల్లు కొంచెం శుభ్రంగ ఉంచుకుంటె చాలు' అన్నడు. ఇంకేం అడక్కపొయ్యేసరికి ఆయన నా కోసమె దిగొచ్చిన ప్రవక్త లెక్క కనబడబట్టిండు.

ఏంటోళ్లని అడగలేదు! ఏ మతమన్లేదు! ఏం కూర తింటరని అడగలేదు. ఎంత మంచోడు! ఇంత మంచోళ్లు కూడ ఉంటరా లోకంలో..! కాని మేం ముస్లింలమని చెప్పాలి కదా.. ముస్లింస్ అని చెప్పంగనె ఈన కూడ కాదంటె? మల్ల తిరిగే ఓపిక లేదు. కాని చెప్పకపోవడం మంచిదికాదు. చూద్దాం..

'సార్? మా మిసెస్ తెలుగే ఎక్కువ మాట్లాడుతది సార్. తెలుగు ఎం.ఎ చేసింది. నేను కూడ తెలుగు పేపర్లనే జర్నలిస్టుగ చేస్తున్న సర్. మేం... ముస్లిమ్స్‌మి సర్! పర్వాలేదు కదా..?' అన్న ఎనకాముందాడుకుంట..

'ముస్లిమ్సా? అరె! నువ్వట్ల కనిపిస్తలేవయ్యా! తెలుగు ఎంత బాగ మాట్లాడుతున్నవ్!?' అన్నడు ఆశ్చరంగ.

మొఖం మీదికి నవ్వు తెచ్చుకొని నిలబడ్డ. తెలుగు రాష్ట్రంల ఉంటె తెలుగు రావడంలో గొప్పేముంది? అయినా తెలుగు వీళ్లొక్కరి సొత్తయినట్లు మాట్లాడతరేంది? ఉర్దూ మాత్రం ముస్లింల ఒక్కరి భాషా? కాదే !

వారం రోజులైనా మా ఓనరు నన్ను అడగని ఆ మూడు ప్రశ్నల మిస్టరీ వీడలేదు. అదే మనసులో తిరుగుతున్నది.

పక్క పోర్షన్‌లో పని చేసే పనిమనిషి మా దగ్గర గుడ చేస్తనని అడిగింది. ఆమె పరిస్థితి విని షాహీన్ ఒప్పుకున్నది. ఒక పనిమనిషిని పెట్టుకోవడం అదే మొదటిసారి. అంట్లు తోమడం, బట్టలుతకడం, ఇల్లు ఊడ్చి, తడి గుడ్డతో తుడవడం ఆమె పని. నెలకు 200 తక్కువే అయినా మాకు భారమే.

ఒకరోజు ఆమె మా షాహీన్‌తో మాట్లాడుకుంట మా ఇంటి ఓనర్ గురించేందో చెప్తున్నది.

'ఓనరోళ్లు ఏంటోళ్లు నర్సమ్మా?' అనడిగిన నేను.

'అరిజన్స్ !' అన్నదామె.

మిస్టరీ మెల్లగా వీడిపోబట్టింది. కుర్చీల కూలబడ్డ.

..అంటె బ్రాహిన్స్‌కి, నాన్‌వెజిటేరియన్స్ అందరూ అంటరానోళ్లే, సూదరోళ్లకు పెద్దకూర తినేటోళ్లు, అంటరానోళ్లు. ముస్లింలకు హలాల్ తినని వాళ్లు అంటరానోళ్లు, గోషా పాటించని వాళ్లు అంటరానోళ్లు. ఇక మిగిలింది ఎవరు? నర్సమ్మ భాషలో 'అరిజన్స్' అంటె దళితులు. దళితులకు ఎవరు అంటరానోళ్లు? ఊహూ! దళితులకు ఎవరూ అంటరానోళ్లు కారు. అంటె దళితులె అసలైన మనుషులు. మిగతావాళ్లే అంటరానోళ్లు కదా!

కళ్లు మూసుకున్న మా ఊరి మాదిగోళ్లు డప్పులు కొట్టుకుంట వస్తున్నరు... 'పెద్దపులి దెబ్బలతో – ఒద్దులు తిరుక్కుంట'..!

అవును.. అందరూ అంటరానోళ్లే..ఒక్క దళితులు తప్ప. అందులోనూ మాదిగోళ్లు తప్ప!

**'అధూరె' ముస్లిం కథలు పుస్తకం నుండి**

***


Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

Broadsheet on Contemporary Politics

**Nizam's Rule and Muslims**
**Truth and Fairy Tales about Hyderabad's Liberation**

*Volume 1, No 1 (Quarterly)* *Bilingual (English and Telugu)* *November 2010* *Donation : Rs. 10/-*

**Contents**

- Editorial
- Silences and History *M.A. Moid*
- A Muslim perspective about Hyderabad *Hasanuddin Ahmed*
- Celebration on my coffin *M.A. Majid*
- Do not hurt self-respect *Rafath Seema & Kaneez Fathima*
- Half-truths, misconceptions! *Divi Kumar*
- Granted Nizam's despotism, what about ARASAM's? *Jilukara Srinivas*
- How the Nizam treated Scheduled Castes *Ashala Srinivas*
- Two connotations of 'Nizam' *R. Srivatsan*

H.E.H. Mir Osman Ali Khan
Nizam of Hyderabad

**Editorial Group:** *M A Moid, A Suneetha, R Srivatsan*

**Translation Team:** *Kaneez Fathima, M.A. Moid, R. Srivatsan (English) A. Srinivas, A. Suneetha (Telugu)*

**Advisory Board:** *Sheela Prasad, Aisha Farooqi, Rama Melkote, K. Sajaya, P. Madhavi, B. Syamasundari, Susie Tharu, Veena Shatrugna, D. Vasanta, K. Lalita, N. Vasudha, Gogu Shyamala, V. Usha*

**Production:** *A. Srinivas, T. Sreelakshmi*

**Published by :** *Anveshi Research Centre for Women's Studies, 2-2-18/49, D.D. Colony, Amberpet, Hyderabad 500013.*


Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

Broadsheet on Contemporary Politics

**Caste, Census, Democracy**
**Different Perspectives**

*Volume 1, No 2 (Quarterly)* *Bilingual (English and Telugu)* *June 2011* *Donation : Rs. 10/-*

**Contents**

- Editorial
- Caste Arithmetic Must Be Revealed *Durgam Subba Rao*
- Will India Become a Caste Society if Caste is Counted? *K. Satyanarayana*
- Caste Enumeration in Census: Constitutional Imperative *Ravi Varma Kumar*
- Caste and Census: A Forward Looking Strategy *Sonalde Desai*
- Why the Census should Not Count Caste *V.K. Nataraj*
- The Politics of Not Counting Caste *Satish Deshpande, Mary E John*
- Explanatory notes in boxes on different pages have been written/compiled by *K.Y.Ratnam*

**Guest Editors : Prof.G.Krishna Reddy, Dr.K.Y.Ratnam, Prof.M.Channa Basavaiah.**

**Resident Editors :** *A.Suneetha, R.Srivatsan, M.A.Moid*

**Advisory Board:** *Sheela Prasad, Aisha Farooqi, Rama Melkote, K.Sajaya, P.Madhavi, B.Syamasundari, Susie Tharu, Uma Bhrugubanda, Veena Shatrugna, D.Vasanta, K.Lalita, N.Vasudha, Gogu Shyamala, V.Usha*

**Production:** *A.Srinivas, T.Sreelakshmi*

**Published by:** *Anveshi Research Centre for Women's Studies, 2-2-18/49, D.D. Colony, Hyderabad - 500 013*

The contents of this broadsheet reflect the data, perspectives and opinions of the contributors and guest editors.

**Photograph :** *Anupam Nath / AP. Borrowed with gratitude from the Guardian, 11th June 2010.*


Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

Broadsheet on Contemporary Politics

**SEZ Policy, Economics and Politics**

*Volume 1, No 3 (Quarterly)* *Bilingual (English and Telugu)* *January 2012* *Donation : Rs. 15/-*

**Contents**

- Editorial
- Impact of land grants to industries *K.Balagopal*
- Industrialization for the people, by the people, of the people *Amit Bhaduri and Medha Patkar*
- Revisiting the policy debate *Aradhana Aggarwal*
- SEZ's have nothing to do with land acquisition *Interview with Kamalnath, Minister for Commerce and Industry*
- Village common lands *HRF pamphlet*
- A representation filed before A.P.H.R.C. against the Kakinada SEZ
- Interview with Rajendra - anti SEZ activist in Nellore *K. Srinivasulu, R.Srivatsan, A.Suneetha, G.Shyamala*
- Hope and Disillusionment for Workers in Apache SEZ, Tada, Nellore *S. Seetha Lakshmi*
- Land acquisitions, law and public purpose *N.Vasudha*
- Eminent domain : a backgrounder *R.Srivatsan*
- China's Special Economic Zones at 30 *Y.Yeung, J.Lee and G.Kee*

**Responses to the broad sheet on the Nizam**

- Letter to the Editor *T. Hanuman Chowdary*
- Hyderabad before and after 17th September 1948 *Kesharrao Jadhav*

**Guest Editors : K.Srinivasulu, N.Vasudha**

**Resident Editors :** *A.Suneetha, R.Srivatsan, M.A.Moid*

**Advisory Board:** *Sheela Prasad, Aisha Farooqi, Rama Melkote, K.Sajaya, P.Madhavi, B.Syamasundari, Susie Tharu, Uma Bhrugubanda, Veena Shatrugna, D.Vasanta, K.Lalita, N.Vasudha, Gogu Shyamala, V.Usha*

**Production:** *A.Srinivas, T.Sreelakshmi*

**Published by:** *Anveshi Research Centre for Women's Studies, 2-2-18/49, D.D. Colony, Hyderabad - 500 013*

The contents of this broadsheet reflect the data, perspectives and opinions of the contributors and guest editors.

# ఆహార శుద్ధి కోసం గోమూత్రం

## ■ గుల్వాడి వెంకట్రావు

*(గుల్వాడి వెంకట్రావు రాసిన కన్నడంలో మొట్టమొదటి సామాజిక నవలగా పేర్కొనబడే 'ఇందిరాబాయి' నుండి ఒక చిన్న భాగాన్ని తీసుకున్నాం. నవలలోని ఈ భాగం 19వ శతాబ్దపు ఉత్తరార్ధంలో ఇంగ్లండులో సివిల్ సర్వీస్ పరీక్ష రాయటానికెళ్తున్న కొడుకుకు, తల్లికి మధ్య జరిగిన సంభాషణ. (ప్రయాణంలోనూ ఇంగ్లండులోనూ కొడుకేం తింటాడో అని తల్లి బెంగ పడ్తుంది.)*

"ఏంటి? పది - పదిహేను రోజుల తర్వాత మళ్ళీ ఎక్కడికెళ్తున్నావు?"

"ఎలాగో నేను విదేశాలకెళ్తున్నాను కదా, ఆ తరువాత!"

"ఎక్కడికీ?"

"విదేశానికి"

"విదేశం అంటే ఎక్కడికి రా?"

"మన మహారాణి నివశించే దేశానికి"

"అక్కడికెందుకెళ్ళాలి నువ్వు?"

"సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయటానికి"

"అయ్యో? ఎన్ని పరీక్షలు వ్రాయాలి? ఎంత దూరంలో వుంది?"

"మనకి 6000 మైళ్ళ దూరంలో"

"అక్కడ వాతావరణం ఎలా ఉంటుంది? ఎటువంటి మనుషులంటారు? మన కులం వాళ్ళెవరైనా ఉన్నారా అక్కడ?"

"మన దేశం నుండి వెళ్ళిన వాళ్ళు ఒక్కళ్ళిద్దరు ఉంటే ఉండొచ్చు"

"నువ్వక్కడ పరీక్ష రాసి తిరిగి రావటానికి ఎన్ని నెలలు పడుతుంది?"

"నెలలు కాదు కనీసం మూడు సంవత్సరాలు పడుతుంది"

"అక్కడి దాకా ఎలా ప్రయాణం చేస్తావు? అక్కడికి చేరటానికి ఎన్ని రోజులు పడుతుంది?"

"ఇక్కడ్నుండి బొంబాయికి స్టీమర్‌లో వెళ్ళి, మళ్ళీ ఇంకో స్టీమరెక్కి విదేశానికి వెళ్ళాలి. మొత్తానికి అక్కడికి చేరుకోటానికి మూడు వారాలు పడుతుంది".

"మధ్య మార్గంలో ఏం తింటావు మరి?"

"ఏదో దారి ఉంటుందిలే. ఏం ఎంతమంది వెళ్ళి రావట్లేదు?"

"ఏ దారి? వేరే వాళ్ళు వండినది తినటమా?"

"ఎందుకు? అమృతయ్య నాకోసం ఒక వంటవాడిని చూసి నాతోపాటు పంపిస్తాడు."

"అది సరే గానీ, ఆ మ్లేచ్ఛులు ముట్టుకోని మంచీనీళ్ళు నీకెక్కడ దొరుకుతాయి?"

"మ్లేచ్ఛులు ముట్టుకోని నీళ్ళు నీకెక్కడ దొరుకుతాయి అని భలే అడుగుతున్నావే? మనం వాడే మంచినీళ్ళన్నీ వాళ్ళు ముట్టుకున్నవే కదా? బ్రాహ్మలేమీ బావులు తవ్వరు కదా? బావులు తవ్వేవాళ్ళు, మనం వాడే నీళ్ళని ముట్టుకునే ఉంటారు".

"వాళ్ళు ముట్టుకున్నంత మాత్రాన ఏమయిందంట? ఆ తరువాత మనం గోమూత్రం చల్లి శుద్ధి చేసుకుంటాం కదా?

"ఇది బాగుంది. నేను విదేశాలకెళ్ళినప్పుడు రెండు కప్పుల గోమూత్రం కూడా తీసుకెళ్తాను"

"నాకేం చెప్పాలో అర్థం కావట్లేదు. ఇంగ్లీషు చదువులు చదివిన వాళ్ళందరూ ఇలాగే అడ్డగోలుగా వాదిస్తారు".

"ఇదేమీ అడ్డగోలు వాదన కాదమ్మా. నువ్వే ఆలోచించి చూడు. స్పర్శ వల్ల ఎలా కలుషితమవుతామో నాకర్థం కాదు. ఒక మ్లేచ్ఛుడు నన్ను ముట్టుకుంటే నా శరీరం అపవిత్రమయిపోతుందా?

"దానిలో సందేహం లేదు"

"మరయితే, నేను మ్లేచ్ఛుణ్ణి ముట్టుకున్నప్పుడు అతని శరీరం పవిత్రమవ్వాలి కదా?"

"నేను అలాంటి విచిత్రమైన ప్రశ్నలకు సమాధానం చెప్పలేను" (నవ్వుతూ)

"అమ్మా! దాన్లో విచిత్రమేమీ లేదు. హృదయం పవిత్రంగా ఉండాలి. లోపల హృదయం కుళ్ళిపోతే గనుక, బయటి నుండి గోమూత్రం చల్లినా ఏం లాభముండదు. ఇంతకన్నా నేన్నీకేమీ చెప్పలేను."

"విదేశాల కెళ్ళటం మన ధర్మానికి విరుద్ధమని మన పెద్ద వాళ్ళంటూ ఉంటారు కదా అలా వెళ్ళొచ్చిన వారిని కులం నుండి బహిష్కరిస్తారు కదా? వాళ్ళెందుకలా చేస్తారు? మరి ఆ వెళ్ళిన వాళ్ళ కులం పోదా?"

"విదేశాలకెళ్ళే వాళ్ళ కులం ఏమీ పోదు. వెళ్ళే వాళ్ళు ఎక్కువయిన కొద్దీ ఎవరి కులం పోతుందో నేన్నీకు చెప్పక్కర్లేదు".

**అనువాదం : ఎ.సునీత**







*పాఠకుల నుండి విమర్శలని, సూచనలని ఆహ్వానిస్తున్నాం.*
*మీ ఉత్తరాలు రాయాల్సిన అడ్రస్: సంపాదకులు, సమకాలీన రాజకీయలపై బ్రాడ్‌షీట్, అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్*
*2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాద్ - 500013. ఇ-మెయిల్ broadsheet@anveshi.org కి పంపించాలి.*
*వ్యక్తిగత ఆరోపణలు లేని, సద్విమర్శ కలిగిన ఉత్తరాలను స్పందనలను తరువాతి బ్రాడ్‌షీట్ సంచికలో ప్రచురిస్తాం.*

# ఆధునిక భారతదేశం శాకాహార దేశమా?

■ స్నేహ షాజ్

భారతీయుల ఆహార అలవాట్లలో చాలా భిన్నత్వం ఉంది. కొన్ని ఆహార పదార్థాలు కొంతమందికి నిషేధం (taboo) కాగా, అవే మరికొంత మందికి నోరూరించే వంటకాలు. శాకాహారులు మాంసాహారంతో నిండిన ప్లేటును చూసి ముక్కులు ఇరుస్తూ దీన్ని ఎలా తింటారు? అని అడగటాన్ని చాలాసార్లు చూస్తాం. అట్లాగే మన స్నేహితులు ఇంట్లో చెప్పకుండా దొంగ చాటుగా బీఫ్‌ను తినడాన్ని చాలా సార్లు చూసేఉంటాం (అమ్మో! అమ్మకి తెలిస్తే చంపేస్తుంది!).

కొన్ని ఆహార పదార్థాలను ఆరోగ్యానికి హానికరమని, చెడ్డవని మనం తొందరపాటుగా తీర్పులు ఇస్తుంటాం. ఇంకా అవి అంటువ్యాధులు వ్యాపింప చేస్తాయని కూడా చెప్పేస్తాం. మనం వంట చేసే పద్ధతులు వేరే విధంగా ఉన్నా, బయటి వాళ్ళ ఆహారం మనకు ఇష్టం లేకున్నా, ఆయా పదార్థాలు అపరిశుభ్రమైనవనీ, అనారోగ్యానికి దారి తీస్తాయనే అంచనాకి త్వరగా వచ్చేస్తాం. ఏ రకమైన ప్రమాణాలు బట్టి ఈ అవగాహనకొచ్చాం అనేది మనలో ఎంతమంది ఆలోచిస్తారు?

తిండి అలవాట్లకు సంబంధించిన ఈ నిచ్చెన మెట్ల అవగాహన ఇప్పుడిది కాదు. కొంత వరకూ పాతదే. ఎన్.పి.నవానీ రాసిన 'కుటుంబ ఆహారం మరియు జాతీయ భద్రత, భారత దేశంలోని అనుభవాలు' అనే రిపోర్టులో 'ప్రతి వ్యక్తికి సాధ్యమైనంత వరకు వివిధ రకాల ఆహార పదార్థాలు సరైన మోతాదులో ఉండే 'సమతుల్య ఆహారం' ప్రతిరోజు దొరికితే ఆ దేశంలో ఆహారం, పౌష్టికాహార భద్రత ఉన్నట్లుగా నిర్ధారించవచ్చు అని అంటారు'. కాని 'సమతుల్య ఆహారం' అన్నదే ఇక్కడ అత్యంత వివాదాస్పదమైన విషయం.

భారతదేశంలో సమతుల్య ఆహారం అనేది 'రికమెండెడ్ డైటరీ అలోవెన్స్' (ఆర్.డి.ఏ) ద్వారా లెక్కించ బడుతుంది. ఇది ప్రత్యేక అవసరాల బట్టి, వయసు బట్టి, ప్రత్యేక గ్రూపులైన చిన్న పిల్లలు, పాలిచ్చే తల్లులు మరియు ఇంకొందరికి ఇలా వివిధ రకాలుగా నిర్ధారిస్తారు. కాని, ఈ పౌష్టికాహార లభ్యత ఆర్థిక అంశం. సాధారణ నడి వయసున్న మగ వారికి రోజుకు 2400కిలో కేలరీల సమతుల్య ఆహారం (వివిధ రకాల ఆహారపదార్థాల నుండి) అవసరముంటుంది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నుండి డిప్యూటీ డైరెక్టర్‌గా రిటైరయిన వీణా శత్రుఘ్న ఏమంటారంటే "సమస్యంతా జనాభా పౌష్టికాహారాల ప్లానింగ్ జరిగినప్పుడు ఈ ఆర్‌డిఏను కేవలం 'ధాన్యాలతో కూడిన అసమతుల్య ఆహారం'గా అర్థం చేసుకుని 'ప్రమాణం'గా తీసుకోవటంతో మొదలయింది". 2400 కిలో కాలరీలు ధాన్యం నుండైతే అతి చవగ్గా, విరివిగా దొరుకుతాయి కాబట్టి ప్లానింగ్ నిపుణులు ఈ రకమైన 'పౌష్టికాహార లభ్యత'ను ఆర్థిక కోణంలో సరైనదిగా తీసుకున్నారు. దీనివల్ల ఆర్‌డిఏను పేదరికాన్ని కొలవటానికి ప్రమాణంగ (దారిద్ర్యరేఖ) తీసుకున్నారు. అంటే ఒక మనిషి 2400 కిలో కాలరీల ఆహారాన్ని రోజు తీసుకోవాలంటే కావల్సిన సగటు ఆదాయం విలువకట్టి దాన్ని దారిద్ర్య రేఖగా నిర్ణయించారు. అంతేకాదు ఈ ప్రమాణంతోనే కనీస వేతనాన్ని కూడా నిర్ణయించారు. దీనివల్లే నుండే మన ప్రజాపంపిణీ వ్యవస్థ కేవలం బియ్యం, గోధుమలు చవగ్గా పంపిణీ చేసే వ్యవస్థగా తయారయింది. అంతే తప్ప మాంసం, గుడ్లు, జీడిపప్పు వంటి పప్పులు, ఏ విధమైన మాంసాహారం కూడా పంపిణీ చేయబడవు. శాకాహారులు అల్పసంఖ్యాకులైన మన దేశంలో మనమిప్పుడు రోజువారీ భోజనాన్ని బ్రాహ్మణీయ విలువల్లో 'మంచి భోజనం' అన్న దానిపై ఆధారపడి ప్లాన్ చేస్తున్నామన్నమాట! ఆధునిక భారత దేశాన్ని శాకాహారిగా తయారు చేస్తున్నాం మనం.

ఇది సంపన్న అగ్రవర్ణాల వారికి చాలా అనుకూలం. వీళ్ళకు అన్నంతో బాటుగా మూడు నుండి నాలుగు రకాల కూరగాయలతో, రకరకాల పప్పులు, నూనెలతో తినేందుకు అవకాశముంటుంది. కాని, ఈ నిర్ణయంతో పేదవాళ్ళకు జీవించడానికి అవసరమైన కీలకమైన శక్తి(ఎనర్జీ) అందుబాటులో లేకుండా పోతోంది. ఈ భావజాల ప్రభావితమైన ప్రభుత్వమేమో పేద వారికి కొంత అన్నం, మూడు రొట్టెలు దొరికితే చాలు వాళ్ళు సంతోషంగా ఉన్నట్లే అని అభిప్రాయపడుతోంది. ధాన్యాల నుండి 2400 కిలో కాలరీలు వస్తాయని, దాన్నుంచి ఎంతో కొంత మాంసకృతులు (ఎంత తక్కువ రకమైనా సరే!) వస్తాయి కాబట్టి అది సరిపోతుందని భావించటం జరుగుతోంది. (మనకింతకన్నా సాధ్యం కాదు కాబట్టి). దాని ఫలితంగా ఏమయింది? మన జనాభాలో అధిక శాతం జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. అంతే!

అధికారులు, న్యూట్రిషనిష్టులు బాగా ప్రొటీన్స్ లభించే మాంసాహారం వైపు ఎందుకు చూడరు? వీణా శత్రుఘ్న చెప్పినట్లు, భారతదేశంలో ఇది ఎక్కువ మంది తినే ఆహారమే కాక, రక్తహీనత ఉన్న చాలా మందికి డాక్టర్లు పెద్ద యెత్తున రికమెండ్ చేసే ఆహారమే కదా? వివిధ రకాలైన రుచులు, వంటలకు ఎందుకు గుర్తింపు లేదు? దీనికి సమాధానం ఏమిటంటే, అధికారులు ఒక సగటున భారతీయ ఆహారాన్ని తీసుకున్నారు కానీ మెజార్టీ ప్రజలు తినే మాంసాహారాన్ని తీసుకోకుండా అగ్రవర్ణాల వారి శాకాహారాన్ని తీసుకొన్నారు. ఈ మైనారిటీ తీసుకొనే ఆహారమే స్టాండర్డ్ ఆహారంగా గుర్తింపబడింది.

ట్రైబల్స్ తీసుకొనే రక రకాల ఆహారాల్లో ఉండే న్యూట్రిషన్ శాతం ఎంత ఉంది అనేది ఎప్పుడూ బేరీజు వేయలేదని అంటారు వీణా శతృఘ్న. వాళ్ళను, వారి ఆచార వ్యవహారాలను కేవలం భావవాద దృక్కోణంలో అర్థం చేసుకున్నాం.

ఆంత్రోపలాజికల్ సర్వేలో వాళ్ళు ఎలా జీవిస్తారు, ఎలా పెళ్ళిళ్లు చేసుకుంటారు అనే విషయాలపై పరిశోధనలు చేసాం. కానీ ఎలాంటి ఆహారం తీసుకుంటారు, ఆహారలేమి వలన వాళ్ల ఆరోగ్యం, అభివృద్ధి, సంతానం, పిల్లలు పుట్టినప్పుడు వారి బరువులాంటి విషయాలపై ఎప్పుడూ సరియైన పరిశోధన జరగలేదు.

దీని ఫలితం? 20 సంవత్సరాల వయసు దాటిన ఎస్.టీలలో 41.9శాతం, ఎస్.సీలలో 38.4శాతం దీర్ఘకాలికంగా శారీరక బలహీనతను కల్గి ఉన్నారు. జాతీయ స్థాయిలో కనుక చూస్తే ఇది 34.8శాతం మాత్రమే. ఇంకా, షెడ్యూల్డ్ కులాల్లో పుట్టే పిల్లలు 62.7శాతం మంది తక్కువ బరువుతో పుడుతున్నారు, 57.6శాతం మందిలో ఎత్తు పెరుగుదల లేకపోవడం ఉంది. ఇదే వేరే కులాల విషయంలో అయితే 53.1 మరియు 50.1శాతంగా ఉంది

మహిళల సమస్య ఇంకా తీవ్రంగా ఉంది. చాలా పరిశోధనలు 'పని చేస్తున్న ఆధునిక మగ మనిషి'ని ఆధారంగా తీసుకుని సూచనలు చేస్తాయి. మహిళలకు, మగవారి సగటును తీసుకొని సర్దుబాటు చేస్తాయి. రకరకాలుగా శ్రమ చేసే విధానాన్ని, భాధ్యతలను, అవసరాలను, మహిళల విషయంలో పరిగణలోనికి తీసుకోలేదు. గత 50సంవత్సరాల నుండి దిగువ మధ్యతరగతి వారికి పుట్టినప్పుడు ఉండే 'పిల్లలు బరువు' పెరగలేదు. గర్భంతో ఉన్న మహిళల కోసం ఐరన్, మల్టీ విటమిన్‌లను అనేక ఫార్మాస్యూటికల్ కంపెనీలు పెద్ద ఎత్తున తీసుకొస్తున్నాయి, అయినా గుర్తించ దగిన స్థాయిలో మార్పు రాలేదు. ఎన్.జి.వోలు మరియు కొంత మంది యాకిటివిస్టులు మగ మనిషి ముందుగా తినగా మిగిలిందే ఆడమనిషికి దొరుకుతుందని, అందువల్లే స్త్రీలలో పోషకాహార లోపం ఉంటుందని ప్రచారం చేస్తుంటారు. కాని, ఇక్కడ సమస్య చాలా స్పష్టంగా ఉంది. డా. వీణా శత్రుఘ్న చెప్పినట్లు ' దిగువ మధ్య తరగతి వాళ్ళకు 80శాతం ప్రొటీన్లు ధాన్యాల నుండే వస్తాయి, ఇలాంటి సందర్భంలో సరిపోయేంత ఆహారమే లేనప్పుడు ఆడ మనిషి ముందు తింటే మాత్రం ప్రయోజనం ఏముంటుంది'?

నిర్ణయించిన 'ప్రమాణాన్ని' పున:పరిశీలన చేయవలిసిన ఉంది. మాంసాహారం, గ్రుడ్లులాంటి వాటిని ఆహార పదార్థాలను ఆర్.డి.ఏ గుర్తించ నిరాకరించింది. అన్ని రకాల సామాజిక వర్గాలలో ప్రతి దినం తీసుకునే ఆహారంలో దీనిని భాగం చేయాలి. క్రింది సామాజిక వర్గం మనుషులకు ఇవి అందుబాటులో ఉండవు అనే వాదన సరియైనది కాదు. గ్రుడ్లు కూరగాయల కంటే చౌకయినవి కదా, పి.డి.ఎస్ ద్వారా ఎందుకు పంపిణి చేయరు? మధ్యాహ్న భోజన పథకంలో కోడి గ్రుడ్డు పెడుతున్నందుకు ఎందుకు మన సంస్కృతి, సంప్రదాయం అని అరిచి గోల చేస్తున్నారు? ఏ మతానికైనా పెద్దకూర తినడం పట్ల ఎందుకు వ్యతిరేకత?

ఆహార అలవాట్లని, పదార్థాలని మతానికి, కులానికి ఎందుకు ముడిపెట్టి చూస్తారన్న ప్రశ్నకి ఇప్పటికీ సమాధానం లేదు. అవకాశాల్లో, ఇష్టాఇష్టాల్లో అందరూ సమానమేనని చెప్పుకునే మన సమాజంలో కులమనేది కేవలం బహిరంగంగా కన్పించే వివక్ష, అణచివేతల రూపంలో మాత్రమే పనిచేయదు అనేది సుస్పష్టం.

(కొంత మంది విద్యార్థులు క్యాంపస్‌లో బీఫ్ స్టాల్స్ పెట్టాలి అనుకున్నప్పుడు దీనిని ఆపాలని కొందరు ప్రయత్నించారు, బీఫ్ ఆరోగ్యానికి హానికరం అనే వాదాన్ని ముందుకు తీసుకు వచ్చారు. డా.వీణా శత్రుఘ్న గారిని దళిత విద్యార్థులు కలిసి పెద్దకూరలో ఉండే న్యూట్రిషన్ విలువల గురించి అడగగా, బీఫ్ తినడం వల్ల అనారోగ్యాలు, అంటు వ్యాధులు రావని లిఖిత పూర్వకంగా ఇవ్వడం జరిగింది.)

**(Outcaste: A Dalit studies Initiative, EFL-U, Hyderabad, A.P.India, Accessed the following link on August 9, 2011, http:// outcaste.blogspot.in/2008/03/ why - is - modern-india-vegetraian.html.)**

**అనువాదం: ఏశాల శ్రీనివాస్, ఆర్.శ్రీవత్సన్**

# కష్టపడే చేతుల బలానికి ఆధారం

■ డు. సరస్వతి

కష్టపడే చేతుల్లో బలమెక్కడ్నించొస్తుంది? అనే విషయాన్ని అర్థం చేసుకునే ప్రయత్నంలో భాగంగా మేం క్షేత్రస్థాయిలో సబాల్టర్న్ సమూహాలతో విస్తృతంగా చర్చించాం. వారి ఆహార అలవాట్ల గురించి ప్రశ్నలు వేయటం చాలా కష్టమయింది. ఒక ఆదివాసీ బాలిక "ఏం ఆహారం? మాకు చాలాసార్లు తింటానికి ఏం ఉండదు" అని ఒక సందర్భంలో మమ్మల్ని తిప్పికొట్టింది. సంచార జాతులకు చెందిన కొంతమంది, అడుక్కోవటం ద్వారా దొరికిన వన్నీ ఒక దగ్గర చేర్చి, బాగా కలిపి, మంట రాజేసి ఉడికించి తింటామని చెప్పారు. జర్నలిస్టు పి.సాయినాథ్ ఒక వ్యాసంలో కొన్ని సమూహాలు ఎలకల కలుగుల కోసం వెతికి అవి వాటిలో దాచిపెట్టుకున్న ధాన్యాన్ని తీసుకుంటాయని రాసారు. మన దేశంలో ఆకలి బాధ అంత తీవ్రంగా ఉంది. నేపాల్, ఉత్తరప్రదేశ్, బీహార్ శివారు ప్రాంతాలలో ఉండే దళిత సమూహాల్లో కొంత మంది స్త్రీలు రోజంతా తిండి కోసం వెతకటంలోనే గడుపుతారని హర్ష మందిర్ రాసారు. ఆవు పేడలో ధాన్యం గింజలేరుకుని వాటిని శుభ్రం చేసుకుని వాడుకుంటారు. కన్నడ భాషలో అణగారిన సమూహాల ఆకలి సూచించటానికి కొన్ని సామెతలు వాడతారు.

"హొలెయా పొట్టనిండిం తరవాతే కుండమీద మూత పెట్టగలం"

"హొలెయాకి ఉలవలు సరిపోతాయి"

"హొలెయాకి మిగిలిపోయిన భోజనం పెడితే, పరమాన్నమనుకుని ఆనందంతో బెంగుళూరు వరకూ పరుగెట్టాడు"

కర్నాటక తీరప్రాంతమైన మంగళూరు ప్రాంతంలో ఒక నానుడి ఉంది "ఉన్నవాళ్ళ ఇళ్ళల్లో పాలు పెరుగుంటాయి, లేని వాళ్ళ గుడిసెల్లో బచ్చలి తీగ కప్పుంటుంది". బచ్చలికూర వారికి ప్రధానమైన ఆహారం. తమ చుట్టుపక్కల తేలిగ్గా, తక్కువ ధరలో దొరికే బలవర్ధకమైన ఆహారాన్ని కుటుంబానికి అందచేయటంలో స్త్రీల పాత్ర ఈ కింది వంటకాలని గమనిస్తే అర్థమవుతుంది.

1.ఎ. గొర్రెలు, ఆవులు, గేదెలు చంపినపుడు కారే రక్తాన్ని పట్టుకోవాలి. కొంచెంసేపటికి రక్తం గడ్డ కట్టిం తరువాత దాన్ని చిన్న ముక్కలుగా చేసి వేయించాలి. వేయించిన ముక్కల్ని పచ్చి మిరపకాయలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, జీలకర్ర, మిరియాలు, ఉప్పు కలిపి నూరిన మసాలాతో ఉడికించాలి. మాంసం అరిగించుకోలేని ముసలి వాళ్ళకి ఈ వంటకం చాలా మంచిదని అంటారు.

బి. ఆవు, గొర్రె, మేక మాంసాన్ని బాగా నూరి మెత్తటి పొడి చెయ్యాలి. తాలింపు వేసి మసాలాతో కలిపి ఉడికించాలి. చిన్న పిల్లలకి, పళ్ళులేని వాళ్ళకి ఇది చాలా మంచిది.

సి. ఆవు మాంసం ఉడికించిన తరువాత వడపట్టి మిగిలిన నీళ్ళని ముసలి వాళ్ళకి, జబ్బుపడిన వాళ్ళకి టానిక్‌లా ఇవ్వటం.

**2 విభిన్న రకాల ఎలుకలు**

ఎ. పొడుగు ముక్కు ఎలక: సాధారణంగా బొరియలో ఒకటే ఉంటుంది. బొరియ లోతుగా ఉంటుంది. నీళ్ళు పోసి దాన్ని బయటకు రప్పిస్తారు. ఈ ఎలక మాంసం పంది మాంసమంత రుచిగా ఉంటుందని అంటారు.

బి. తెల్ల ఎలక: ఒక్కో బొరియలో ఐదారుంటాయి. పిడకల్ని కాల్చి పొగపెట్టి ఎలకల్ని బయటకు రప్పిస్తారు. అవి పారిపోకుండా బొరియపైన బట్ట కప్పుతారు. అవి పొగతో బొరియలోనే చనిపోతే, తవ్వి బయటికి తీస్తారు. వీటి మాంసం కోడి మాంసంలా ఉంటుందంటారు.

సి. వల ఎలక : 20 అడుగుల లోతు కలుగుల్లో ఉంటాయి. ప్రతి కలుగులో 30-40 దాకా ఉంటాయి. గాలి కోసం కలుగుకి చిన్న చిన్న కంతలు పెట్టుకుంటాయి. వాటిని పట్టుకోటానికి ప్రయత్నించినపుడు ఆ కంతల ద్వారా పారిపోతాయి. ముందు ఆ కంతల్ని మూసి ఎలకలు బయటికి వచ్చేలా చేస్తారు. ఒక్కొక్కదాన్ని వస్తుండగానే పట్టుకుంటారు. వీటి మాంసం ఎక్కువ శాతం కొవ్వుని కలిగుంటుంది అంటారు.

డి. పెద్ద ఎలక: ఈ ఎలక దాదాపు ఒక కిలో బరువుంటుంది. ఇవి చిన్న పుట్టల్లో ఉంటాయి. దాన్ని మంటమీద కాల్చి, బొచ్చు తీసేసి శుభ్రం చేస్తారు. తరువాత చిన్న చిన్న ముక్కలు చేసి, మసాలా వేసి జారుగా కూర చేస్తారు. మరి కొందరు, దానికి ఉప్పు, కారం రాసి మంట



DSU

**DALIT STUDENTS' UNION**
UNIVERSITY OF HYDERABAD
P.O. CENTRAL UNIVERSITY
Gachibowli, Hyderabad - 500 046. A.P. (India)
Email: dalit_hcu@yahoo.co.in Website : www.dalitstudentsunion.multiply.com

President : Praveen Veluvolu (Ph.D., Comparative Literature) Cell : 9959046997
Vice Presidents : Naveen Kumar Emmadi (M.Phil., Economics); Vijaya Kota (M.A. Political Science)
General Secretary : Prasanth Kumar Munnangi (M. Phil., Sociology) Cell : 9848426885
Treasurer : Ramanjaneyulu. M (M. Phil Political Science)
Cultural Secretary : Sathish Tippavarapu (M.Sc Statistics)
Joint Secretaries : Rajashekhar Velpula (M.Phil Political Science); Babu Rao. A (M.Phil., Hindi); Kishore Kumar. A (M.A. Sociology)
Organising Secretaries : Mohan Rao. G (M.A., Telugu); Bhoj Ram. S (M.A., Hindi); Mahender. K (M.A., Telugu)
Legal Advisor : G. Elisha, Advocate, High Court A.P. India
Technical Advisor : Suresh Kumar Digumarthi (Ph.D., Political Science)
Advisors : D. Shivaji (Ph.D., History); Ravi Gurajala (Ph.D., Economics); Thomas Babu. P (Ph.D., Hindi); D. Sudhakar Rao (Ph.D., Life Science)

Ref.

Date : 14-02-08

To
The Deputy Director
National Institution of Nutrition
Hyderabad.

SUB:- seeking a certificate on beef and its nutritious values

Respected Madam,

We, Dalit Students' Union (DSU) central University of Hyderabad are seeking a nutritious certificate saying, beef is not a contagenious, its a healthy food.

We want to know the benefits of beef on a clear note. Hence our humble request is to the Organisation is to give a nutritious certificate.

Thankyou

yours sincerally.
V. Praveenkumar.
President DSU

మీద కాలుస్తారు ఇదింకా రుచిగా ఉంటుందని అంటారు.

3. కుంకురు గడ్డ(అడవి ఉల్లిగడ్డ) చపాతీ : ఇది సాధారణంగా మైదాన ప్రాంతాల్లో దొరుకుతుంది. శుభ్రంగా కడిగి బొగ్గుల్లో ఉడకపెడతారు. ముద్దగా చేసి రాగి పిండితో కలుపుతారు. ఒక గుడ్డ మీద రొట్టె చేసి, పెనం మీద కాలుస్తారు. ఆరోగ్యానికిది మంచిదంటారు. 'పేదవాళ్ళ రొట్టె' అని దీనికి పేరు.

4 ఎ. పీతల సూప్ : పీతని శుభ్రం చేసి మెత్తగా నూరతారు. సన్నటి గుడ్డలో తీసుకుని దాని రసం ఒక గిన్నెలోకి వడపోస్తారు. ఉప్పు, పచ్చిమిరపకాయలు, చింతపండు, ఉల్లిపాయ, వెల్లుల్లి, కొత్తిమీర, కొబ్బరి పువ్వు (గుజ్జు) వేసి రసంలో కలిపి మొత్తం ఉడకపెడతారు. తరువాత తాలింపు వేస్తారు. బాలింతలకి ఇది తింటే బలవర్ధకమైన ఆహారమని అంటారు. పాలెక్కువ పడతాయంటారు.

బి. యంద్రకాయని దంచి వెల్లుల్లి, మిరియాలు కలిపి నాలుగయిదు గ్లాసుల నీళ్ళలో ఉడికిస్తారు. నీళ్ళు సగం ఇగిరిన తరువాత వడబోసి, బాలింతలకి మూడు రోజులపాటు తాగిస్తారు.

సి. చీమల పుట్టలో రాణి చీమలు : వాటిని పట్టుకుని, శుభ్రం చేసి తింటారు. శుభ్రం చేసి, విరిచి, నెయ్యిలో వేసి, ఆ నేతిని పసిపిల్లలకి తినిపిస్తారు.

6. పుట్టగొడుగుల సాంబార్ : శుభ్రం చేసిన పుట్టగొడుగులని తాలింపువేసి ఉడికిస్తారు. ఉడికేటప్పుడు, మాంసంలో వేసే మసాలా కలుపుతారు.

7. ఉడుము సాంబార్ : ఉడుము మాంసాన్ని శుభ్రం చేసి నూనెలో వేయించి, లవంగం, వెల్లుల్లి, ఉల్లిపాయ, అల్లం, కరివేపాకు, కారం కలిపిన మసాలాతో ఉడికిస్తారు. ఉడికేటప్పుడు, కొంచెం పంచదార లేక బెల్లం కూరలో వేయాలి.

8. గుల్కాయి సాంబార్ : గుల్కాయ గింజలు తీసి, శుభ్రం చేసి నీళ్ళల్లో ఉడికిస్తారు. వేయించిన అవరెకాయలు కలుపుతారు. పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, వెల్లుల్లి, టమాట, ధనియాల పొడి, ఉప్పు గుల్కాయ కూరలో వేసి ఉడికిస్తారు.

9. గొడ్డుకారం : వేయించిన ఉల్లిగడ్డ, వెల్లుల్లి, చింతపండు, కొత్తిమీర, మెంతి ఆకులు, ఎర్ర మిరపకాయలు, జీలకర్ర, ఉప్పు, కొంచెం నీళ్ళు వేసి మంచిగా నూరుకోవాలి. మనక్కావల్సినట్లు దినుసులు మార్చుకుని వేరే రకంగా కూడా చేసుకోవచ్చు.

10. పాలగుజ్జు : వంకాయ, ఆలుగడ్డ కడిగి ముక్కలు చేసుకోవాలి. వెల్లుల్లి, ఉప్పు, కారం వేసి ఉడికించాలి. ఉడికిన తరువాత చల్లార్చి, కొంచెం పాలతో పాటు మరికొంత వెల్లుల్లి, కారం కలుపుకుని మళ్ళీ ఉడికించాలి. బాగా రుచిగా ఉండటమే కాక, కఫం కరిగించటానికి పనికొస్తుంది.

11. కొంగ గుడ్డు : కొంగలు చెరువులు, కొలనుల పక్కన పెరిగే ముళ్ళ కంపల్లో గుడ్లు పెడతాయి. లేత నీలం రంగులో ఉండే గుడ్డను ఆహారంగా తీసుకుంటారు. గుడ్డు చుట్టూ పేడ పూసి మంటలో పడేస్తారు. పది పదిహేను నిమిషాల తర్వాత బయటికి తీసి, పేడ, గుడ్డు పెంకు తీసేసి లోపలి భాగాన్ని తింటారు.

12. కాల్చిన బీఫ్ : ఎండబెట్టిన బీఫ్‌ని మంటలో కాల్చి భోజనంలో నంజుకోటానికి వాడతారు. ఇది సంవత్సరమంతా తింటారు. ఒక్కోసారి గొడ్డుకారంతో కలిపి కూడా తింటారు.

13. కుందేలు చెవి కూర : ఈ మొక్క కొండ ప్రాంతాల పొదల్లో దొరుకుతుంది. కాడలు కత్తిరించుకుని కడిగి ముక్కలు చేసి, వాటిని ఎర్ర మిరపకాయలు, జీలకర్ర పొడి, ఉప్పుతో కలిపి పది పదిహేను నిముషాల పాటు ఉడికిస్తారు.

14. కుందేలు చెవి కూర పచ్చడి : కాడలు ముక్కలు చేసి, ఉల్లిపాయ, వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు, ఎర్రకారం, నల్లమిరియాలు వేసి నూనెలో వేయించాలి. అన్నంతో, రాగి ముద్దతో తింటారు. ఈ పచ్చడి ఆరోగ్యానిక్కూడా మంచిది.

15. పచ్చి వానపురుగులు : వాన పడంగానే లైట్ల చుట్టూ ముసురుకునే వాన పురుగుల్ని పట్టుకుని పచ్చిగానే తింటారు. పురుగుల్ని ఎండబెట్టి, వాటిని బియ్యం, వేయించిన ఉలవలు, పెద్దశనగలు, కోరిన కొబ్బరి, బెల్లంతో కలుపుతారు. చిత్రదుర్గ జిల్లా చుట్టుపక్కల ఈ రుచికరమైన పొడిని తింటారు. (చిక్కన్న నుగ్గెకట్టె 'జానపద అడుగె' లో దీని గురించి రాసారు.)

16. నోలిగా తెగ అడవిలో దొరికే చాలా రకాల పళ్ళు, కారె, నూలి, జగడి, పోకల, దరసాల, తాటిపండు, అడవి నేరేడు, జీడికాయ అన్నిటినీ తింటారు. పచ్చిపళ్ళు తింటారు. లేదా పళ్ళ రసం తీసుకుంటారు. వాటి గింజలను స్థానిక మందుల తయారీలో వాడతారు. ఉప్పు వేసి రాత్రంతా ఊరబెట్టి, నేరేడు కాయను తెల్లారింతర్వాత తింటారు.

**పేదవాళ్ళు తినే ప్రత్యేక వంటకాలు :**

1. నామదలిగె : జొన్న పిండిని బెల్లం, కొబ్బరి కోరు, అల్లం, యాలకులుతో కలిపి కొట్టి చెక్క బల్ల మీద అప్పడం లాగా చేసి, నాలుగు ముక్కలు కోసి, దేవుడికి ప్రసాదం పెట్టి తింటారు.

2. మారడి బొబ్బట్లు : కర్నాటకలోని తూమ్కూరు, మధుగిరి తాలుకాలలోని అడవులలో మారడి చెట్లు మేలో పండ్లు కాస్తాయి. పండులో జీడి చుట్టూ గట్టి టెంక ఉంటుంది. పక్షులు పండ్ల రసం పీల్చేసిన తరువాత, ఎండిన పండ్లను ఏరుకొస్తారు. టెంక పగిలిన తర్వాత లోపలున్న జీడి బాదంలా ఉంటుంది. ఈ నూనె గింజును 'పప్పు' అని పిలుస్తారు. వీటితో బొబ్బట్లు చేసుకుంటారు. (చిక్కన్న నుగ్గెకట్టె 'జానపద అడుగె'లో దీని గురించి రాసారు).

3. రకరకాల ధాన్యాలు, జొన్నలతో పేదవాళ్ళు రొట్టెలు చేసుకుంటారు. బొబ్బట్లు లేదా సజ్జిగె లాంటి స్వీట్లు కూడా చేసుకుంటారు.

4 ఎ. వేయించిన ఎండ్రకాయ : ఎండ్రకాయని శుభ్రం చేసి, దానిలో కారం, కొబ్బరి, ఉల్లిగడ్డ, కొత్తిమీర, మెంతి ఆకులు, చెక్క, ధనియాలు, మిరియాలు, టొమాటో కలిపిన మసాలా నూరి నూనెలో బాగా వేయిస్తారు.

బి. ఎండ్రకాయ సాంబారు : ఇదే మసాలాని సాంబారు పెట్టటానిక్కూడా ఉపయోగిస్తారు.

5. గేదె మాంసం సాంబారు: కడిగిన గేదె మాంసం నీళ్ళతో ఉడికిస్తారు. ప్రక్కనే కొబ్బరి, కారం, వెల్లుల్లి, అల్లం, కొత్తిమీర, పాలకూర, మెంతికూర, గసగసాలు, మిరియాలు, పసుపు, ఉప్పు, బెల్లం కలిపి మసాలా తయారు చేసి దానిక్కలుపుతారు. ఇది సాధారణంగా షెడ్యూల్డు కులాలు తినే వంటకం. దీన్ని అన్నంతో తింటారు. రాగి ముద్దతో లేదా చపాతీతో తింటారు.

6. నక్క మాంసం సాంబార్ : శుభ్రం చేసిన నక్క మాంసం ముక్కల్ని జీలకర్ర తాలింపు వెయ్యాలి. మిరియాలు, వెల్లుల్లి, చింతపండుని మెత్తగా నూరి మాంసం ఉడుకుతున్నప్పుడు కలపాలి. ఉప్పు కూడా వెయ్యాలి. చివరగా ఉడుకుతున్న సాంబారులో కారం, జొన్నపిండి కలపాలి. రానుకొండ కులం వారు ఈ వంటకాన్ని బాగా వండుతారని ప్రతీతి. బాలింతలక్కూడా ఈ వంటకాన్ని పెడతారు.

7. కర్రి నక్క : (పంది మాంసం సాంబారు) శుభ్రం చేసిన పంది మాంసం ముక్కల్ని కొంచెం నీళ్ళు కలిపి ఉడకపెట్టాలి. ఉడుకుతున్నప్పుడు కొబ్బరి కోరు, ధనియాలు, అల్లం, వెల్లుల్లి, మిరియాలు, లవంగం, చెక్క, టమాట, ఉప్పు కలిపిన మసాలా వెయ్యాలి. ఈ వంటకాన్ని కొరవ (ఎస్‌సి) కమ్యూనిటీ తయారు చేస్తారు. ప్రసవించిన ఐదు రోజుల తర్వాత స్త్రీలకి ఇది తినిపిస్తారు.

8. ఆంబర: పప్పు ఉడకపెట్టిన నీళ్ళని వడబోసి పడెయ్యాలి. దానిలో ఆవాలు, జీలకర్ర తాలింపు పెట్టాలి. అప్పుడు దాన్ని కొత్తిమీర, కరివేపాకు, వెల్లుల్లి, చింతపండు రసం, మిరపకాయలు, ఉప్పు, కొంచెం బెల్లం కలిపి ఉడకబెట్టాలి. బొబ్బట్లు చేసినపుడు, బెల్లం బదులు, ఈ తియ్యటి పప్పు ముద్దని వాడతారు.

9. చేపల సాంబారు : ఉల్లిగడ్డ ముక్కల్ని వెల్లుల్లి, కొత్తిమీర, మెంతాకులు, అల్లం, వేయించిన కొబ్బరి, ఉల్లిగడ్డ కలిపి నూరిన మసాలాతో వేయించాలి. వేయించిన మినపప్పు పిండి, కారం వేయాలి. అవి ఉడుకుతున్నప్పుడు శుభ్రం చేసిన చేప ముక్కలు వేయాలి.

10.ఎ. ఎర్ర చీమల పచ్చడి : మల్నాడులో ఎర్రచీమలతో చిగుళి అనే పచ్చడి చేస్తారు.

బి. ఎండ్రకాయ పచ్చడి : కరడి, బెల్లెడి లాంటి రకరకాల పీతలతో చట్నీ, సాంబారు చేస్తారు.

11. పూజలు, పండగలప్పుడు మిగిలిపోయిన అన్నం తెచ్చి, ఎండబెట్టి తరువాత వాడుకుంటారు.

12. చుట్టు పక్కల దొరికే దుంపల్ని తెచ్చి వండుతారు.

**దు. సరస్వతి బెంగుళూరులోని**
**సామాజిక కార్యకర్త దళిత రచయిత్రి**
**అనువాదం: ఎ.సునీత**

# "ఆహార సంస్కృతి–రాజకీయాలు' చర్చ

ఇక్కడ పొందుపరిచిన వివరాలు, గోగు శ్యామల మరియు డా॥బి.ఆర్.వెంకటరావుతో బ్రాడ్‌షీట్ సంపాదకీయ వర్గం జరిపిన చర్చ నించి తీసుకున్నాం. గోగు శ్యామల ప్రముఖ రచయిత మరియు అన్వేషిలో రీసెర్చ్ ఫెలో. డా॥బి.వెంకటరావు ఇఫ్ఎల్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

ఈ చర్చంతా చిన్నతనంలో తిన్న వంటకాలని, తిండిని గుర్తుచేసుకున్న ఆనందం, ఆ అనుభవాలని స్నేహితులతో కలిసి పంచుకునేటప్పుడు కలిగే సంతోషం, నవ్వులతో నడిచింది. అదే సమయంలో పైకి సరళంగా కన్పించే ఆహార అలవాట్లను నియంత్రించే రాజకీయాలను ఆహార సంస్కృతుల్లోని భిన్నత్వం ఏరకంగా వివక్ష, హింసకు దారితీస్తుందో, అర్థం చేసుకుని, విమర్శకు గురిచేసే ప్రయత్నం కూడా జరిగింది.

చర్చని మొదలుపెడ్తూ శ్యామల తన చిన్నతనం గుర్తుకు చేసుకున్నారు. తమ ఊరిలోని మాదిగవాడ వేరే ప్రపంచం. తమకి, అగ్రకులాల వారికి చాలా దూరం ఉండేది. వారితో కలవటం అనేది అరుదు, కాబట్టి చిన్నప్పుడు ఎద్దుకూర తినటం పట్ల పై కులాల వారికున్న చిన్నచూపు, వ్యతిరేకతల గురించి అస్సలు తెలియదు. అప్పుడు నిజానికి మాంసం కూరంటే ఎద్దుకూరే! బట్టలలో తెచ్చి ఈ మాంసం మాదిగవాడలో అమ్మేవాళ్ళు. మేక మాంసం కూడా తరచు తినేవాళ్ళు. కొన్ని పండగలకి దర్గాలలో మేక మాంసం అర్పించి, తరవాత తినేవారు. దీనిని 'చిన్న కూర' అనేవారు. ఇక కోడి మాంసం అంటే మాంసం కింద లెక్కకి వచ్చేది కాదు. అదీ ఆకుకూరలు ఒకటే అనుకునేవారు!

ప్రతి రెండు, మూడు రోజులకి ఒకసారి పెద్దకూర తినేవారు. అది తిన్న రోజే తృప్తిగా భోజనం చేసినట్టు ఉండేది. వాళ్ళ వాడలో ఎద్దుకూర తినే వాళ్ళ పిల్లలు ఆరోగ్యంగా, బలంగా ఉంటారని అనుకునేవారు. అసలు కూరంటే ఎద్దు మాంసం ముక్కలు వేస్తేనే కూర, లేకుంటే కూర కాదు. బొమికలతో సూప్ కూడా చేసేవారు.

సాధారణంగా వాళ్ళు ఎప్పుడూ ఎద్దు, గేదెల మాంసం తినేవారు. పాలిచ్చే ఆవులని ఎప్పుడూ మాంసం కోసం చంపేవారు కాదు. ఎద్దు, గేదె, మేక ఈ జంతువులని గ్రామ దేవతల గుడిలో బలి ఇచ్చేవారు. ఇలా బలి ఇచ్చినప్పుడు ఆ మాంసం పోగుల వేసి పంచుకునే వారు. ఆ పంచుకోవడంలో చాలా గొడవలు జరిగేవి. ఊరిలో జరిగే పండగలకి గుడిలో జంతు బలి ఎప్పుడూ మాదిగలు నిర్వహించేవారు. జంతు బలి ఇవ్వడం, ఆ తర్వాత ఆ మాంసం వండి తినడం మాదిగల పని. అయితే తనకి 16–17 వయసు ఉన్నప్పుడు కొందరు మాదిగ యువకులు ఈ బలులు చేయడానికి నిరాకరించారు. అప్పటికే ఉన్న జంతుబలి నిరోధక చట్టాన్ని ఆసరాగా తీసుకుని వీరు, తమ ఊళ్ళో బలి చేయం అని, అందుకు సహకరించమని పోలీసులని అడిగారు. అగ్రకులాల వారికి ఈ ధోరణి మింగుడు పడలేదు. గుడిలోని ఆచారాల పేరుతో వారి ఆధిపత్యం కాపాడు కునేందుకు వారు మాదిగలు తప్పకుండా ఈ జంతుబలిలో పాల్గొనాలని, పైపెచ్చు ఆ బలి ఇచ్చిన జంతువు మాంసం మాదిగలు వండుకుని తినాలని పట్టుపట్టారు. ఎన్నో ఏళ్ళుగా వారికి పోలీసులు పరోక్షంగామద్దతు ఇవ్వటం వల్ల జంతు బలిని నిషేధిస్తూ చట్టాలు ఉన్నా అవి ఎప్పుడూ అమలు కాలేదు. ఎద్దు మాంసం తినటం ఇష్టమైనా, జంతు బలి ఇవ్వటం నిరాకరించి, ఈ అగ్రకుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించారు మా ఊరి మాదిగలని, శ్యామల వివరించారు. దీని ద్వారా మాదిగ ఆత్మ గౌరవ ప్రకటన కూడా చేసారని ఆమె అన్నారు.

పెద్దకూరతోపాటు, అప్పుడప్పుడు వేరే రకాల మాంసం కూడా తినే వాళ్ళమని శ్యామల చెప్పారు. వాళ్ళ నానమ్మ పొలాల్లో దొరికే పీతలని పట్టుకుని, వాటితో చాలా రుచికరమైన కూర చేసేదని అన్నారు. కానీ వాళ్ళ ఇంట్లో మిగతా ఎవరికీ ఈ వంటకం రాదని అన్నారు. ఎప్పుడైనా చాలా అరుదుగా కుందేలు మాంసం దొరికేది. దాన్ని ఇష్టంగా తినేవారు. చేపలు తినటం కూడా అరుదే. వానాకాలంలో చెరువులు, బావులు నిండి, పొంగుతున్నప్పుడు చేపలు దొరికేవి, అప్పుడు వాటిని పట్టుకుని తినేవారు.

అయితే రోజువారి ఆహారం మాత్రం జొన్నరొట్టె, పప్పుచారు, వరితోపాటు, కొర్రలు, తైదలు వంటి ఇతర ధాన్యాలు కూడా తినేవారమని శ్యామల అన్నారు. ప్రస్తుతం బిపిటి వరి సాధారణంగా దొరికే రకం, కాని తన చిన్నప్పుడు కృష్ణనీలలు, గోషవాసలు వంటి ఇతర రకాల వరి ధాన్యాలు కూడా దొరికేవని చెప్పారు. వంటనూనె కోసం నల్ల కుసుమలు, తెల్లకుసుమలు అనే నూనె గింజలు వాడేవారు. పండగ రోజులలో గోధుమ పిండి, బెల్లం కలిపి పోలెలు తయారు చేసుకునే వారు. పండగ మరుసటి రోజు మాత్రం ఎప్పుడూ పెద్దకూర తినేవారు.

వెంకట్ తన పెరిగింది కోస్తాలోని గుంటూరు జిల్లా పాంచాలవరం గ్రామం అని చెప్తూ, శ్యామల చెప్పిన విషయాలకీ, తన అనుభవాలకీ చాలాపోలిక ఉందన్నారు. తమ మాల కులంలో కూడా పెద్దకూర అత్యంత సాధారణమైన ఆహారమని అన్నారు. కూర అంటే ఎండిన ఎద్దు మాంసం ముక్కలో, లేక ఎండు చేప ముక్కలో లేకుండా చేసేవారే కాదని ఆయన అన్నారు. అయినప్పటికి మాంసం కోసం ఎద్దుని కానీ, గేదెను కానీ కోస్తున్నప్పుడు మాత్రం ఒక రహస్య భాష ద్వారా ఈ విషయాన్ని తమ వాడలో చాటించేవారు. పొద్దున్నే ఒకళ్ళు 'మల్లెపూల'ని, లేకుంటే 'రామకోటి మిఠాయి' అని అరుచుకుంటూ వెళ్ళితే అందరికి ఎద్దు మాంసం దొరుకుతుందని తెలిసేది.

అయితే బడిలో చేరిన తర్వాతే ఆయనకి ఎద్దుకూర తినే వారి పట్ల ఉన్న చులకన, చిన్న చూపు అనుభవంలోకి వచ్చింది. బడిలో టీచర్లు తరచు మాల పిల్లలని మొద్దులని తిట్టేవారు. అది కూడా వారు ఎద్దు మాంసం తినటం వల్ల ఇలా మొద్దుగా, తెలివి తక్కువగా తయారైనారని తిట్టేవారని వెంకట్ చెప్పారు. తనకి ముఖ్యంగా ఒక బ్రాహ్మణ టీచరు బాగా గుర్తని వెంకట్ అన్నారు. ఈయన కేవలం పాలు, పళ్ళు తీసుకునేవారు. బడిలో పిల్లలని మాంసం తినవద్దనీ, ముఖ్యంగా ఎద్దుకూర తినవద్దని చెప్పేవారు. అందరూ శాకాహారులుగా మారాలని ఎప్పుడూ చెప్పేవారు. చాలా మంది విద్యార్థులు స్కూల్లో చేరిన తర్వాత మాంసం తినటం మానేశారు.

ఈ సందర్భంలో, శ్యామల కూడా తను సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చేరిన తరువాతే ఎద్దుకూర తినే వారి పట్ల అసహ్యం ఉందని తెలిసిందని అన్నారు. తనకి హాస్టల్‌లో పెద్దకూర దొరక్కపోవటం చాలా బెంగ కలిగించేదని, పైగా అక్కడ వారు పెట్టే మేక / గొర్రె మాంసం అస్సలు పడేది కాదని, కడుపులో తిప్పేదని అన్నారు.

ఆడగేదెలని ఎప్పుడూ మాంసం కోసం చంపేవారు కాదని వెంకట్ అన్నారు. అసలు ఆవు మాంసం తింటారని తనకు చాలా రోజులు తెలియదని కూడా అన్నారు. వాళ్ళు తినే మాంసం ఎప్పుడూ మగ గేదెల నుండి వచ్చినది. హైదరాబాద్ వచ్చిన తరవాతే ఆవు మాంసం తింటారని తనకి తెలిసిందన్నారు. ఆవు మాంసం తినే అలవాటు ఎక్కువగా నల్లగొండజిల్లాలో ఉందని శ్యామల చెప్పారు. చచ్చిపోయిన జంతువుల మాంసం సాధారణంగా తినేవారు కాదని వెంకట్ చెప్పారు. అయితే ఒకే ఒకసారి తన చిన్నతనంలో వచ్చిన ఎద్దు మాంసం తమ చుట్టాలందరూ పంచుకున్న గుర్తు ఉందని ఆయన అన్నారు.

వెంకట్ తన చిన్నతనంలో చాలా రకాల ఇతర మాంసాహారాలు తినేవారమని చెప్పారు. పొలాల్లో దొరికే నత్తలు చాలా రుచిగా ఉండేవి. తాబేలు, జంగుపిల్లి, కొంగలు, నిప్పుకోళ్ళు వీటి మాంసం తినేవారు. అప్పుడప్పుడూ కోయ వాళ్ళు తెచ్చి అమ్మే గాడిద మాంసం కూడా తినేవారు. పంది మాంసం కూడా తరచుగా తినేవారు. ఎండు ఎద్దుకూర కూడా ఏమీ దొరకని రోజులు తినేవారు. వీటితోపాటు వరి, కందులు, మినుములు, పెసలు వీరి ఆహారం. కూరగాయలు ఎప్పుడూ కొనేవారు కాదు. పొలాల్లో ఏమి దొరికితే అవి – వంకాయలు, దొండకాయలు, దోసకాయలు, గుమ్మడి, బెండ చిక్కుడు ఇలా –

కోస్తా ఆంధ్రలోని మత మార్పిడి చరిత్ర తను పరిశోధిస్తున్నప్పుడు తనకి చర్చి రికార్డుల్లో పంది మాంసం సర్వసాధారణంగా చాలా మంది జనం తినేవారని పలు

ఆధారాలు దొరికాయని వెంకట్ అన్నారు. ఇది 1850ల ప్రాంతంలో 1851 మరియు 1861 లలో సంభవించిన కరువు కాలంలో అన్ని వర్గాల, కులాల వారు ఎద్దు మాంసంతోపాటు చచ్చిన జంతువుల మాంసం తినేవారనటానికి చాలా దాఖలాలు దొరికాయన్నారు. కానీ, తరువాతి కాలంలో మళ్ళీ ఎద్దుకూర తినటం అనేది నిషేధం అయినట్లు ఉన్నది. దీని ప్రభావం వల్లనేమో ఇప్పటికి గోదావరి జిల్లాల మాలలు, పెద్దకూర తినరని వెంకట్ తెలిపారు.

సాంబయ్య గుండిమెడ (శ్యామ్) మాట్లాడుతూ తను పెరిగింది కోస్తా ఆంధ్రాలోని విజయవాడ దగ్గర గుండిమెడ అనే ఊరన్నారు. దాదాపుగా వెంకట్ చెప్పిన వివరాలన్నీ కూడా తమ ఊళ్ళో ఉన్న ఆహార సంస్కృతికి దగ్గరగా ఉన్నాయని ఆయన అన్నారు. తన చిన్నప్పుడు తాము ఎలా పొలాల్లో తిరుగుతూ కాకి గుడ్లు, కొంగ గుడ్లు ఏరి పోగు చేసి అట్లు వేసుకునే వారో శ్యామ్ వివరించారు. అప్పుడప్పుడు ఆ గుడ్లకి పేడ రాసి వాటిని నిప్పులో ఉడకబెట్టే వారని చెప్పారు. పొలాల్లో ఎలకలని పట్టుకుని, వాటిని కాల్చి ఉప్పు రాసుకుని తినేవారు. నిజానికి పొలాల్లో ఏది దొరికితే అది తినేవారు – వేరుశెనగ, పెసలు, కందులు, నత్తలు. తమ మామయ్య ఒకాయనకు వర్షాకాలంలో ఎగిరే పురుగులు, ఊసులంటారు, వాటిని పట్టుకుని వేయించి తినటం చాలా ఇష్టం అని చెప్పారు. మిగతా ఎవరు తినకపోయినా, ఆయన మాత్రం అవి తినేవారని అన్నారు.

శ్యామల కూడా తాము పొలాల్లో తిరుగుతూ ఏది దొరికితే అది తినేవాళ్ళమని చెప్పారు. తాటిపళ్ళు కాల్చుకుని తినే వాళ్ళు, గేగు కాల్చుకుని తినేవాళ్ళు, ఇంకా సీమ చింతకాయలు, పల్లీ కాయలు, ఖర్జూర చెట్టు బెరడు నించి చాలా కమ్మటి గుజ్జు వచ్చేదని, అది పిల్లలు ఎంతో ఇష్టంగా తినేవారని ఆమె గుర్తు చేసుకున్నారు.

వెంకట్ సీఫెల్ యూనివర్శిటీలో చేరిన తరువాత దళిత బహుజన మైనారిటీ విద్యార్థి సంఘం (డిబిఎమ్ఎస్ఎ) తరఫున తాము నిర్వహించిన "బీఫ్ ఫెస్టివల్" (పెద్దకూర పండుగ) గురించి చెప్పారు. ఇది 2004లో నిర్వహించారు. ఇప్పటి లాగానే అప్పుడు కూడా కొన్ని వర్గాల నుండి దీనికి చాలా వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. హాస్టల్ మెస్‌లో ఉన్న వంటవాళ్ళు ఎద్దు మాంసం వండమని వెళ్ళిపోయారు. అప్పుడు వేరే వంట పాత్రలు, సామాను తెచ్చుకుని విద్యార్థులే వండి తినే అందరికీ పెట్టారు. ఇదేకాక, వెంకట్ అసలు హాస్టల్‌లో దొరికే ఆహారం లోనే మనకి శాకాహార సంస్కృతి యొక్క ఆధిపత్యం కనిపిస్తుందని నొక్కిచెప్పారు. ఇది ఎలా అంటే – మామూలు ఆహారం శాకాహారం – ఎప్పుడైనా గుడ్డు కానీ, చేపలు కానీ, కోడి కూర కానీ, ఇస్తే వాటికి అదనంగా విడిగా రూ.3,10,15 చొప్పున డబ్బు తీసుకునేవారని చెప్పారు. ఇలా కాకుండా డిబిఎమ్ఎస్ఎ తరఫున వారు పోరాడి ఈ పదార్థాలను కూడా ప్రధానమైన ఆహారంలో భాగం చేసి శాకాహారులకి వీటి బదులు పళ్ళుగానీ, స్వీటు గానీ ఇచ్చే ఏర్పాటు చేశారు.

**చర్చ నిర్వహణ, కూర్పు – ఉమ భృగుబండ**

# పని స్థలం(కబేళా)

## ■ జరీన్ అహ్మద్

ఢిల్లీ లోని ఈద్గా 'కబేళా' కటిక(కసాయి) వాళ్ళ ప్రధాన కూడలి(పని స్థలం). దీన్ని 'కమేలా' లేక 'మండి' అంటారు. ఎందుకంటే అదే ప్రాంతంలో జంతు వ్యాపార కేంద్రం కూడా ఉంది. ఇది ఈద్గా రహదారిలోని సదర్ బజార్ వెనుక ఉంది. 1914లో నిర్మించబడి ఏడు ఎకరాల్లో విస్తరించబడిన ఈ ప్రదేశంలో వాటిని నిర్వహించే కార్యాలయాలు కూడా ఉన్నాయి. దీనిలో ప్రధానంగా మూడు భాగాలున్నాయి. హలాల్, ఝట్కా మరియు గేదెల విభాగం. ప్రతిభాగం మరల రెండు విభాగాలుగా చేయడమైంది. పరీక్షించడం మరియు వధించడం. జంతువులను వధించడానికి ముందు పశువైద్యుడు వాటిని పరీక్షించి పంపుతారు. ప్రతి జంతువు మీద నామమాత్రపు రుసుం వసూలు చేస్తారు. కబేళా మంగళవారం మినహా ప్రతి రోజు ఉదయం ఐదు గంటల నుండి మధ్యాహ్నం పన్నెండు వరకు పని చేస్తుంది. హిందువులకు పవిత్రమైన మంగళవారం మాంసం ముట్టని దినంగా గుర్తించబడింది. 1994 నుండి ప్రభుత్వ సెలవు దినాలే కాకుండా నవరాత్రి రోజులలో మూడు రోజులు సెలవులుగా గుర్తించబడ్డాయి.

(అక్టోబర్, 2009 సుప్రీం కోర్టు ఆదేశంతో మూసి వేయబడిన ఈ 'కబేళా' ఇప్పటి వరకు తెరవలేదు)

**రైతు నుండి కటిక వానికి:**

పాత పద్ధతిలో ఈ మొత్తం క్రమం – అంటే జంతువును రైతునుండి కటిక స్థలం చేర్చే వ్యవహారం పద్నాలుగు మందితో కూడి ఉంటుంది.

1. హర్యానా, రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ మరియు మధ్యప్రదేశ్ నుండి జంతువుల ఆలనాపాలన చూసే రైతులు
2. పశువులను గుర్తించే వ్యాపారి
3. పశువులను ఢిల్లీకి తరలించే వ్యక్తి
4. ప్రయాణ మార్గంలో సహకరించే సహాయకుడు
5. ఢిల్లీలో సరఫరా చేసే వ్యాపారి
6. ఢిల్లీలో కమీషన్ ప్రతినిధి
7. జంతువులను కబేళాకి తరలించే క్రమంలో వాటిని చూసుకునే సహాయకుడు.
8. కబేళాలోని చౌకీదారు.
9. కమీషన్ ప్రతినిధి నుండి జంతువును కొని, చంపి కసాయి అంగడి వానికి అమ్మే వ్యక్తి (కొన్నిసార్లు ఈ వ్యాపారులు కమీషన్ ప్రతినిధి నుండి నేరుగా కొనడం కూడా జరుగుతూ ఉంటుంది).
10. నిర్దిష్టమయిన పద్ధతిలో జంతువును చంపే కసాయి వాడు
11. జంతు చర్మాన్ని తొలగించే వ్యక్తి
12. మాంసం మరియు ఇతర భాగాలను కసాయి వాడి నుండి తరలించే బండివాడు.
13. చిల్లర వ్యాపారస్తుడు
14. అంగడిలో సహాయం చేసే వ్యక్తి.

ఈ వ్యవహారంలో లావాదేవీలు మొత్తం నోటి మాట మీద అప్పుగా జరుగుతూ ఉంటాయి. కమీషన్ ఏజెంట్ అంగడి వానికి అప్పు మీద ఇచ్చి తిరిగి వసూలు చేసుకున్నప్పుడు చెల్లించటం జరుగుతూ ఉంటుంది. అతడు ఈ డబ్బును సేకరించటానికి వ్యాపారుల వద్దకు తిరుగుతుంటాడు. మామూలుగా టీ సమయంలో కలిసినప్పుడు వసూలు చేస్తుంటారు. ప్రతిఒక్కరు ఈ సమూహంలో కలిసి పని చేస్తుంటారు.

ఈ వ్యవహార క్రమంలో మొదటి రెండు పాత్రలు, రైతు మరియు వ్యాపారస్తుడు – ముఖ్యంగా ముస్లిమేతరులు. రవాణాదారు, సరఫరాదారు మరియు సహాయకుడు రెండు వర్గాల నుండి ఉంటున్నారు. ఖురేష్ వంశానికి చెందినవారు కమీషన్ ప్రతినిధులుగా ఉన్నారు. కాపరులు మరియు చౌకీదారులు వివిధ కులాలకు చెంది, ముఖ్యంగా పేద ముస్లింలయిన సమీప ప్రాంతాల వారు ఉన్నారు. పైన పేర్కొన్న విభాగాల్లోని 9,10,11,13 మరియు 14వ విభాగం వారు ముఖ్యంగా ఖురేష్ వంశానికి చెందినవారు. ఈ క్రమంలో ఖురేష్ వంశస్తులు ఎక్కువగా ఉన్నా, మిగిలిన వారు హిందువులు, శిక్కులు, ముస్లింలు, దళిత క్రైస్తవులు మరియు దళిత హిందువులు కూడా తగినంత సంఖ్యలో ఉన్నారు. దాదాపు అన్ని విభాగాలతో లావాదేవీలుండటం వలన ఖురేషీ కమీషన్ ఏజెంట్‌లు ఈ వ్యవహారంలో తప్పనిసరిగా తమవారుండేట్లు చూసుకుంటున్నారు. ఈ వ్యాపారంలో పరోక్షంగా లాభపడే వారు కూడా చాలా మందే ఉన్నారు. కటిక మహిళలు కబేళాకు వచ్చి మాంసంలో మిగిలిన తలకాయ, బోటీ, గిట్టల భాగాలను కొని 'మందగీర్' లాంటి దళితవాడల్లో అమ్ముతారు. ఇది తక్కువ ధరలో దొరికే అధిక ప్రొటీన్స్ గల ఆహారం. పశు వులను మాంసంగా కటిక అంగడికి లేక హొటళ్ళకు పంపే క్రమం మాత్రమే కాకుండా ఇతర రకాలైన లాభదాయక ఎగుమతులు; పశు సంబంధింత ఉత్పత్తులుంటాయి. కొమ్ములు, చర్మం, వ్యర్థ మాంసం, ఎముకలు, జీర్ణకోశం, రక్తం, కొవ్వు ఇవన్నీ సమీప ప్రాంతాలకు పంపించబడతాయి. అక్కడ ప్రాథమిక ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిని పరిశ్రమలు, ఇతరత్రా వాటికి అమ్ముతారు. ఈ వ్యాపారంలో ప్రతి దశలో ఒక ప్రత్యేక ఉత్పత్తుల క్రమం ఉండటమే కాక, వాటిలో మాంసం పరిశ్రమపై పరోక్షంగా ఆధారపడే వారి పాత్ర కీలకంగా ఉంటుంది.

**అనువాదం: ఎల్.వి.లక్ష్మి, ఆర్.శ్రీవత్సన్**

**Excerpted from: Taleem, Tanzeem our Tijaarat: the changing role of the AIJQ, Zarin Ahmad**
**Source : Frontiers of embedded Muslim Communities in India**
**ed.by Vinod K. Jairath - London : Routledge, 2011.**

# హైదరాబాదులో బీఫ్ వ్యాపారం : సాధక బాధకాలు

■ మహమ్మద్ అబ్దుల్ ఫహీమ్ ఖురేషి

*లండన్‌లో న్యాయవాదిగా శిక్షణ పొందిన మహమ్మద్ అబ్దుల్ ఫహీమ్ ఖురేషి గారు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న AIJQAC (All India Jamiat-ul-Queraishi Action Committee)కి అధ్యక్షుడిగా ఉన్నారు. AIJQAC ఆంధ్రప్రదేశ్‌లో ఖురేషి వర్గం (కటిక ముస్లిం వర్గం) వారి తరపున చురుకుగా పనిచేస్తోంది. ఫహీమ్ ఖురేషి ఆంధ్రప్రదేశ్ మల్ల యుద్ధ సంఘానికి (Arm Wrestling Association) కూడా అధ్యక్షత వహిస్తున్నారు.*

**గొడ్డుమాంసం: పెరిగిన గిరాకీ**

నిజాం కాలంలో జనాభా తక్కువయినందున వారికవసరమయిన గొడ్డుమాంసం స్థానికంగా లభ్యమయ్యే ఆవులు, ఎద్దులు, దూడలు, బఱ్ఱెలతో సరిపోయేది. అప్పట్లో మాంసం ఎగుమతి లేనందున తక్కువ ధరకు అమ్మడంతోపాటు మాంసాన్ని ఇప్పటి లాగా ఖచ్చితంగా తూచేవారు కాదు. జంతువులు పరిసర ప్రాంతాలలో మేయటం వలన వాటి మాంసం రుచిగా ఉండేది. అవి ఆరోగ్యంగా, పుష్టిగా కూడా ఉండేవి. ఆవు మాంసంలోని రుచి, పోషక విలువల వల్ల అప్పటికి, ఇప్పటికి అది బహుళ ప్రియత్వంగా ఉంది.

మాంసం ధర అందుబాటులో ఉండి, కటిక వాళ్ళకు కూడా సంతృప్తికరమయిన ఆదాయం ఉండేది. ప్రస్తుతం జనాభా పెరుగుదల మాంస వ్యాపారం పై ప్రతికూల ప్రభావం చూపుతోంది. అలాగే రాష్ట్రం (ఆ.ప్ర) నుండి మాంసం ఎక్కువగా వియత్నాం, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మరియు రష్యా దేశాలకు ఎగుమతి చేయబడింది. ఆవుల్లో వచ్చే "మాడ్ కౌ", "ఫుట్ మరియు మౌత్" వ్యాధుల భయం వల్ల అమెరికా మరియు యూరప్‌లకు ఎగుమతి తగ్గిపోయింది.

ఇక్కడి పశువులు శాస్త్రీయ పద్ధతిలో సృష్టించబడే సంకరజాతి కాకుండా సహజరీతిలో పెంచబడినవి. మరియు వీటిలో వ్యాధి నిరోధక శక్తి అధికం. కాబట్టి ప్రపంచం మొత్తంలో ఈ మాంసానికి గిరాకీ బాగా ఉంది.

ప్రస్తుతం మాంసం తినడమనేది అనేక కులాల్లో ఫ్యాషన్‌గా మారింది. గొడ్డుమాంసం శాస్త్రీయంగా మంచిదని నిరూపణ కావడంతో చాలా మంది తినడం మొదలు పెట్టారు. గతంలో వైద్యపరంగా గొడ్డుమాంసం తినే కొంత మంది అగ్రకులాల వారు ఇటీవలి కాలంలో దానిని అలవాటుగా మార్చుకున్నారు.

**చట్టాలు, నిబంధనలు:**

ఆంధ్రప్రదేశ్‌లో ఆవుని దైవంగా పూజించే హిందూ మతంలోని ఒక వర్గం మాంసంకోసం ఆవులని చంపటాన్ని నిషేధించాలంటూ ప్రచారం చేయడంతోపాటు న్యాయస్థానాలలో వాజ్యాలు వేసింది. దీంతోపాటు బక్రీదునాడు ముస్లింలు ఆవుని బలి ఇవ్వడం ప్రధానం, అందువల్ల ఆవులని చంపరాదని ఈ వర్గం వారు వాదిస్తున్నారు. ఈ ప్రచార ఫలితంగా "ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధ మరియు జంతు సంరక్షణ చట్టం, 1977" (A.P.Prohibition of Cow slaughter and Animal preservation Act, 1977) వచ్చింది. కొన్ని అసాధారణ పరిస్థితుల గురించి చట్టం ఏం చెబుతోందంటే 'ఒక ఆవు లేదా మరేదైనా జంతువు ప్రజా ప్రయోజనానికి హానికరమని పశువైద్యుడి చేత నిర్ధారింపబడితే దాన్ని చంపవచ్చు. పరిశోధన, ప్రయోగాల కోసం ఆవులను చంపడమనేది ప్రభుత్వ సంస్థలలో అనుమతింపబడింది. ఈ చట్టానికి ముందు మరో చట్టం "ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ప్రాంతం) జంతువధ చట్టం, 1950) ((The A.P.(Telangana Area) slaughtering of Animals Act, 1950) ఉండేది. అప్పుడు ఆవులని నిషేధింపబడలేదు కానీ దీని బదులుగా వచ్చిన 1977 చట్టంలో 'గోవధ'ను చేర్చటం జరిగింది. ఈ కొత్త చట్టం ద్వారా ఆవులు, దూడలు, వ్యవసాయం మరియు ఇతర అనేక పనులలో ఉపయోగించే జంతువులను చంపటాన్ని నిషేధించారు. కబేళాకు తరలించే జంతువులను పరీక్షించటానికి ముందు 24 గంటలపాటు విశ్రాంతిగా ఉంచాలి. పశువుని చంపిన తర్వాత దాని మాంసం తినదగినదిగా ఉందని పశువైద్యుడు నిర్ధారించిన తర్వాతనే మాంసం దుకాణాలకు పంపబడుతుంది. ఈ నిబంధనలన్నీ 1977 తరువాత అమలులోకి వచ్చాయి. దీనివల్ల ఆవు మాంసం బహిరంగ మార్కెట్‌లో నుండి మాయమయింది. అక్రమంగా, రహస్యంగా జంతువులను చంపి మాంసం అమ్ముకోవటం మొదలయింది.

ఈ చట్టానికి ముందు మరొక కేంద్ర ప్రభుత్వ చట్టం "జంతువుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టం, 1960" (The prevention of cruelty to Animals Act, 1960) చేసారు. దీని ప్రకారం "జంతు రవాణా నియమాలు" (The transport of Animal rules) 1978లో ప్రవేశపెట్టారు. ఇందులో పశువుల రవాణాకు సంబంధించిన నియమాలు విశదీకరించారు. దీని ప్రకారం : ఒక వాహనంలో నిర్దేశించిన సంఖ్యకన్నా ఎక్కువ పశువులను ఉంచరాదు, వాహప ఉపరితలం మెత్తగా మృదువుగా ఉండాలి. ప్రథమ చికిత్సా సాధనాలు మరియు పశువులకు తగినంత పశుగ్రాసం వాహనంలో ఉంచాలి. దూరప్రయాణాలప్పుడు పశువులకు కొంత విరామం ఇవ్వడం, ఆరు బయల్లో కొంత దూరం నడిపించటం మొదలైనవి చేయాలి. కబేళాకు తరలించే పశువులను పరీక్షించటం, చంపటానికి సంబంధించిన నియమాలు 2001లో వచ్చిన 'కబేళా నియమాలు' (slaughter houses Rules) లో వివరంగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 1977లో వచ్చిన చట్టం ప్రకారం గోమాంసం నిషేధించటం వల్ల ఎద్దు మాంసం ఎక్కువగా వాడుకలోకి వచ్చింది. ఇదే విధమైన చట్టాలు ఇతర రాష్ట్రాలలో కూడా జారీ కావటంతో అక్కడ బఱ్ఱె మాంసం వాడుకలోకి వచ్చింది.

ఈ చట్టం వల్ల వచ్చిన మరొక ముఖ్య పరిణామం హిందూ మతస్తులు పెద్ద ఎత్తున పశువిక్రయం, మాంస వ్యాపారంలోకి వచ్చారు. మరోవైపు ఈ చట్టం కటిక ముస్లింలను, ముస్లిం వ్యాపారస్థులను ముఖ్యంగా 'బక్రీదు' సమయంలో వేధించడానికి ఉపయోగపడింది.

**కబేళాలు**

ఎమ్.సి.హెచ్. అధీనంలో హైదరబాద్ నగరంలో ఐదు కబేళాలుండేవి. అవి రన్‌మస్త్‌పుర (గొడ్డు మాంసం), అంబర్‌పేట మరియు బోయిగూడ (గొడ్డు మరియు గొఱ్ఱె, మేక మాంసం), జియాగూడ మరియు గౌలిపుర (గొఱ్ఱె, మేక మాంసం). ఈ కబేళాలు జనం నివసించే ప్రాంతాలకు దూరంగా ఉండేవి. క్రమంగా జనాభా ఈ కబేళాల చుట్టు పక్కల వరకు విస్తరించడం, ప్రజలు వీటివల్ల తమకు కలిగే అసౌకర్యాల గురించి ఫిర్యాదు చేయడం, న్యాయస్థానాలను ఆశ్రయించడం జరిగింది. 2003 జూన్‌లో హైకోర్టు ఈ కబేళాలను ఆరునెలలలోపు మూసివేయాలని ఆదేశించింది. ప్రభుత్వం ఈ కబేళాలను ఆధునీకరించదలచింది. దీనికి న్యాయస్థానం అంగీకరించి, ఆధునీకరణ పూర్తయిన తర్వాత ఈ చట్టాన్ని నిషేధించడానికి ఒప్పుకుంది. నిర్దేశించిన ఈ ఆరునెలల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనవంతు బాధ్యతను నిర్వర్తించలేదు. ఈ ఆధునికీకరణ పూర్తి చేయటానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తేవటానికి AIJQAC, 2003 డిసెంబరు 1వ తేదీన ఏర్పడి, ఉద్యమం ప్రారంభించింది. దీని ఫలితంగా MCH Standing Committee కబేళాల ఆధునీకరణ చేపట్ట తలచింది. MIM ప్రెసిడెంట్ కీ॥శే॥ సుల్తాన్ సలా ఉద్దీన్ ఒవైసీ గారికున్న ఆసక్తి మరియు ఖురేషి వర్గం సహకారం ఈ ప్రతిపాదన తేవటానికి దోహదపడ్డాయి. ఈ నాలుగు కబేళాల ఆధునికీకరణ అక్టోబరు, 2012 నాటికి పూర్తయి అవి ఆచరణలోకి వస్తాయని అంచనా.

## గొడ్డు మాంసం ధరలు

ఆధునీకరణ తర్వాత మాంసం ధరలు పెరగడానికి అవకాశముంది. ప్రస్తుతం ఒక జంతువు మీద అయ్యే ఖర్చు 20 రూపాయలుండగా ఇది 125 రూపాయల వరకు పెరిగే అవకాశముంది. ఈ కబేళాలను బహుళ జాతి సంస్థలకిస్తే మాంసం ధర మరింత పెరిగే అవకాశముంది.
హైదరాబాద్‌లోని ఈ నాలుగు కబేళాలను ప్రభుత్వం ఆధునీకరించటం భారతదేశంలోనే ప్రథమం. వీటి నిర్వహణకు, మాంసం ఎగుమతికి ప్రభుత్వ సహకారం ఉండటంతో అనేక కబేళా నిర్వాహకులు, ఎగుమతి చేసే సంస్థలు వాటి పట్ల ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఇది ముడిపదార్థంగానే గుర్తించడం వల్ల దీని మీద ఎటువంటి రుసుం లేదు. పశువుల వ్యాపారంపై నామమాత్రపు రుసుం ఉంది. ఇది పెరగవచ్చు. మా సంఘం దృష్టిలో గొడ్డు మాంసం ఎగుమతి ఆపివేస్తే ధర కిలోకి 60 రూపాయలుండవచ్చు (ప్రస్తుత ధర కిలోకి రూ.160/–) ఈ ఎగుమతి అనేది స్థానికంగా ఉండే మాంస వినియోగదారులకు అనువుగా లేకపోవటంతో మాంస అనుబంధ ఉత్పత్తులకు గిరాకీ ఏర్పడింది. తక్కువ ధరలో మేలురకం మాంసాన్ని ప్రజలకు అందించాలని మా సంఘం కోరిక.

## హైదరాబాద్ లో గొడ్డు మాంసం వ్యాపారం

నగరంలోని గొడ్డుమాంసం దుకాణాల్లో ఎక్కువగా బర్రె లేక ఎద్దు మాంసాన్ని అమ్ముతారు. పశువుల్ని వివిధ జిల్లాల్లోని వ్యవసాయ సంతల నుండి సేకరిస్తారు. కబేళాలు మూతపడిన తర్వాత నగరంలో ఎన్ని జంతువులను చంపుతున్నారో అంచనా వేయడం కష్టం. అయితే చంగిచర్ల కబేళాలో ప్రతిరోజూ నాలుగువేల జంతువుల మాంసం తయారవుతుంది. దీనిలో సుమారు 80 శాతం మాంసం ఎగుమతి చేయబడుతోంది. ఈ కబేళాలు మూతపడిన తర్వాత ప్రయివేట్ వ్యక్తులకు చెందిన అనేక చిన్న కబేళాలు చట్టవిరుద్ధంగా, అక్రమ మార్గంలో వచ్చాయి. ఎందుకంటే చంగిచర్ల కబేళా నగరానికి దూరంగా ఉండటంతో మాంసం అక్కడి నుండి పొందటం కష్టమైనదే కాకుండా ఖర్చుతో కూడుకున్నది.

గొడ్డు మాంసం వ్యాపారం అనేక రకాలైన ఇబ్బందులను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇందులో ముఖ్యంగా జంతుహక్కుల మరియు గోరక్షణ సంఘం సభ్యులని అబద్ధం చెప్పి జంతువులను రక్షించే నెపంతో స్వాధీనం చేసుకొని అమ్మేవారు. వీరికి పోలీసుల సహాయం కూడా ఉంటుంది. చాలాసార్లు ఈ జంతువులను గోశాలకు పంపకుండా స్వంత ఉపయోగానికి లేదా సంతలో అమ్మివేయడం చేస్తుంటారు. ఈ ఇబ్బందులే కాకుండా శీతలీకరణ సదుపాయాలు తగినంతగా లేకపోవడం వల్ల ప్రస్తుతం ఉన్న సదుపాయాల ఖర్చు పెరిగిపోతూ ఉంది. ఈ మొత్తం గొడ్డు మాంస వ్యాపార క్రమంలో రైతులు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు

## గొడ్డు మాంస వ్యతిరేక శక్తులు

జంతుహక్కుల కార్యకర్తలు మరియు గోసంరక్షణ సంస్కర్తలు ఇద్దరూ ఒక్కటే. ఎందుకంటే జంతు హక్కుల కార్యకర్తలు ఆవులు మరియు గేదెల సంరక్షణ మాత్రమే చూస్తారు. జంతు సమూహానికి సంబంధించిన మేక, గొర్రె, పంది, కోడి మాంస వ్యాపారాల విషయం వీరు పట్టించుకోరు.
గో సంరక్షణ కార్యకర్తలు స్థానిక పోలీసుల నుండి కోర్టు, మంత్రుల స్థాయి వరకు ఉన్న అధికారులతో సత్సంబంధాలు కొనసాగించడానికి తగిన శక్తియుక్తులు కలిగి ఉంటారు. ఉదాహరణకు 2003లో ఆంధ్రప్రదేశ్ పోలీసుల కోసం గో సంరక్షణా చట్టాలపై ఒక చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. అయితే ఈ పుస్తకంలో 'జంతువధ'ను అధికారికంగా సమ్మతించిన విషయాన్ని వెల్లడించలేదు. నిధులను సమీకరించుకోవడం కోసం కొన్ని ప్రాంతాలను గుర్తించారు. హైదరాబాద్‌లోని ఒక వ్యాపార కూడలిలో 20 లక్షల రూపాయలను ఆ ప్రాంతంలోని వ్యాపారులనుండి వసూలు చేయదలచారు. హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా వ్యాపారులందరూ ఈ నిర్దేశిత మొత్తాన్ని చెల్లించాలి. నాకు తెలిసిన వ్యాపారి ఒకరు గోసంరక్షణ సమితులకు సంవత్సరానికి 20వేల రూపాయలు ఇస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో 102 పశుసంరక్షణ సమితులుండగా హైదరాబాద్‌లో 13 సంరక్షణ సమితులున్నాయి. వీరు వందలకొద్దీ గోశాలలను సంరక్షిస్తున్నారు. ఇది గత దశాబ్దం నుండీ గణనీయంగా పెరిగింది. వీరి కార్యక్రమాల ఫలితంగా కటిక వాళ్ళే కాకుండా, పాలవిక్రయ కేంద్ర యజమానులు కూడా అనేక కష్టనష్టాలకు లోనవుతున్నారు.

## ప్రభుత్వపాలనా రాజకీయాలు

పశు విక్రయం మరియు మాంస వ్యాపారానికి ప్రభుత్వం పలు చట్టాలు, సంస్థల ద్వారా మద్దతిస్తోంది. ఉదాహరణకు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మరియు పశూత్పత్తి చట్టం, 1966 (A.P.Agriculture produce and Live stock act, 1966), ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సంస్థ, పశుపోషణ సంస్థ, మత్స్యశాఖ, మాంస మరియు కోళ్ళ పరిశ్రమాభివృద్ధి మండలి మొదలైనవి. ఆంధ్రప్రదేశ్‌లో 317 పెద్ద తరహా విక్రయ కేంద్రాలు మరియు 577 అనుబంధ విక్రయ కేంద్రాలున్నాయి. వీటిలో పండ్లు, కూరగాయలు, ధాన్యాలతో సహా అనేక రకాలైన పశు వులు కూడా అమ్మబడతాయి. ప్రభుత్వం పశువిక్రయాలపై ఒక్క శాతం మార్కెట్ రుసుం, రెండు శాతం కమీషన్ విధిస్తూ రశీదు ఇస్తుంది. గత ఏడాది ప్రభుత్వం సుమారుగా ఐదు వందల కోట్లు ఈ పశు వ్యాపారం పై లాభం పొందింది. ప్రతి మున్సిపాలిటీలోను ఒక కబేళా ఉంది. ముస్లిం జనాభా ఎక్కువగా లేని జిల్లాల్లో క్రైస్తవులు, హిందువులు ఈ కబేళాలను నిర్వహిస్తూ, వీటి సౌకర్యాలను ఉపయోగించుకుంటున్నారు.

పశు వ్యాపారంపై వ్యవసాయదారులకు తగినంత ఆదాయం లభిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులను త్వరితంగా అమ్ముకోవాల్సి వస్తుంది. కానీ పశు విక్రయం దాని అవసరం ఉన్నప్పుడే చేయవచ్చు. వ్యవసాయం, పాలకేంద్ర నిర్వహణలో పశు పెంపకం యొక్క ఉపయోగం గురించి తెలుసు కనుక దానికనుగుణంగా నిర్ణయం తీసుకుంటారు. ఈ రకంగా మాంసం వ్యాపారంలో రైతు అత్యంత లాభం పొందుతున్నాడు. రైతులకు ప్రభుత్వం నుండి రక్షణ ఉంటుంది. కానీ గోరక్షణ సమితుల వల్ల ప్రభుత్వం నుండి మాంస వ్యాపారానికి రక్షణ లభించదు. దీని ఫలితంగా ఈ వ్యాపారం అప్పుడప్పుడు బెదిరింపులతో అణచివేతకు లోనవుతూ ఉంటుంది. ఇన్ని ఇబ్బందులలో కూడా మాంస వినియోగం మరియు ఎగుమతులు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వానికి ఈ పరిస్థితుల పట్ల అవగాహన కలుగుతోంది.

ఈ విపత్కర పరిస్థితులలో మాకు ఎమ్ఐఎమ్ మినహా ఏ రాజకీయ పార్టీ సహాయం చేయదు. గత ఏడాది తాడేపల్లిగూడెంలో స్థానిక గోరక్షణ సమితి పశువులను గోశాలకు తరలించడం జరిగింది. వాటిని తిరిగి పొందటానికి ఒక న్యాయవాదిగా కోర్టు ఉత్తర్వులతో అక్కడికి వెళ్ళాను. గ్రామం మొత్తం మాకు వ్యతిరేకంగా నిలచింది. అధికారి ఒకరు నన్ను తప్పించుకోమని చెప్పారు. నా పరిస్థితి గురించి అప్పుడు ఢిల్లీలో ఉన్న హైదరాబాద్ పార్లమెంటు సభ్యుడైన అసదుద్దీన్ ఒవైసీ గారికి ఫోన్ ద్వారా సందేశం పంపాను. ఆయన ముఖ్యమంత్రితో మరియు స్థానిక పోలీసులతో మాట్లాడారు. కొన్ని క్షణాల్లో పోలీసులు అక్కడికి వచ్చి మమ్మల్ని రక్షించారు. న్యాయపరమైన హక్కుతో కొన్న పశువుల్ని పోలీసుల రక్షణతో తిరిగి లారీలలోకెక్కించడం జరిగింది.

## AIJQAC (All India Jamiat-ul-queraishi Action Committee)

ఖురేషి వంశం వారు కటిక వాళ్ళుగా పిలవబడతారు. ఆంధ్రప్రదేశ్ లో సుమారుగా 40 వేల మంది ఈ కమ్యూనిటీలో ఉన్నారు. AIJQ (All India Jamiat-ul-Quraish) వీరికి హైదరాబాద్ ప్రతినిధులుగా ఉన్నారు. హైదరాబాద్‌లో కబేళాలను మూసివేసే విషయంలో 2003లో AIJQ విధానానికి ప్రతిచర్యగా AIJQAC ఏర్పాటయింది. AIJQ కబేళాలను మూసివేయడం మరియు నగరం నుండి తరలించటానికి మద్ధతునిచ్చింది. దీన్ని చాలా మంది ఖురేషి వంశస్థులు వ్యతిరేకించారు. వీరి వ్యతిరేకతను తెలియజేయటానికే AIJQAC ఏర్పాటు చేయబడి, దాని ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరాహార దీక్షలు, ధర్నాలు, మాంసం దుకాణాలను పదిహేను రోజులపాటు మూసివేయటం లాంటివి జరిగాయి. దీని ఫలితంగా ప్రభుత్వం పాత కబేళాలను ఆధునీకరిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో AIJQACకు అధిక సంఖ్యలో ఖురేషి కమ్యూనిటీ వారి ఆదరణ ఉంది. AIJQAC ముఖ్య ఉద్దేశ్యం కబేళాలకు న్యాయపరమైన భద్రత కల్పిస్తూ వాటి కోసం పోరాడటం. అంతేకాకుండా ఈ కమ్యూనిటీ వారిలో విద్యాభివృద్ధి మరియు సామాజిక చైతన్యం ప్రోత్సహించడం.

**అన్వేషి బ్రాడ్‌షీట్ సంపాదక బృందంలోని**
**ఎమ్.ఎ.మొయీద్ కి చెప్పిన విషయాల నుండి.**
**అనువాదం :ఎల్.వి లక్ష్మి**

# అది మా ప్రాణం

## ■ గోగు శ్యామల

పెద్దకూర మా సాంప్రదాయం
గొడ్డుకూర మా పచ్చదనం
గొడ్డుకూర మా జీవావరణం
గొడ్డుకూర మా ప్రాణం
గొడ్డుకూరను తినొద్దంటె ఎట్ల?
ఇంకోమాటడుగుత తినొద్దననీకె నీవెవరు? ఏడికెళ్ళి వచ్చినవ్?
గొడ్డుతో నీకేం సంబంధమని అడుగుతున్న.

ఈ పొద్దు దాక నీ ముఖానికీ
రెండు ఎడ్లను  సాదినవా
రెండు బర్లను, రెండు ఆవులను, రెండు గొర్లనైనా..
పోని రెండు కోళ్ళను పెంచిన యాదున్నదా?
నీవు గొడ్డు గోదా జీవాలను అడ్వికి కొట్టుపోయింది లేదు
అవిటిని మేపింది లేదు..

కాల్వ మడుగుళ్ళ దిగింది లేదు
వాటి పెయ్యితోమి కడిగింది లేదు...
ఎద్దు చెవెంత లోతుంటదో నీకు తెలువది
దానికెన్ని  పళ్ళుంటయో తెలువది
పన్ను నొప్పిలేస్తే ఏ మందెయ్యాల్నో తెలుసా?
దానికి గిట్టలయితే ఏం జెయ్యాల్నో తెలుసా?
ఇంతకూ నీకు తెల్సిందేంది?
పెద్దకూర తినొద్దని చెప్పనీకె
దాని తుప్పుడు సంగతన్న ఎర్కెనా?

బిడ్డకు, కోడలకి పసికూన పాలకు
బాలెంత రాలికి కీమ తినవెట్టాలనే
ఎల్లమ్మ పెద్దకూర ఎత్వాసం
ఊరంత దేవులాడినా దొర్కని గొర్జిం
మాదిగెల్లమ్మ గుడిసె నిట్టడికో
మాల సత్తెమ్మ ఇంటి వాసానికో యాలాడి కనిపించింది
పసిపిల్లలకు పాలర్గకపోయినా
పెద్దలకు రోగాలు నొప్పులొచ్చినా
గొర్జిం వాడకం చేస్తున్న వాళ్ళను
పెద్దకూర తినొద్దంటె
పాత సెప్పులు నెంకుతరు జెర పైలం..!

మాదిగ మాలలు పెద్దకూర తినుడే కాదురా...
భూమిని దున్ననీకే
అడ్విని చేసి
దున్నను చేసి
ఎడ్లను చేసి
తరాల తరబడి భూమి దున్నుతున్నరు
పశువుల సంతతిని పెంచుతున్నరు
పది కిలోమీటర్ల కొక 'సంత' వెల్సిన రివాజీద

దక్కన్ తెలంగాణ మహారాష్ట్ర
సూరత్ నుండి కేరళ దాక
మల్నాడు, కర్ణాటక
చిత్తూరు నెల్లూరు ఒంగోలు ఔరంగబాదుల్లో
నిలబడి ఎటు చూసినా పశుల సంతలే
ప్రపంచంలో కౌబాయ్‌లు కనిపిస్తరు గాని
పశుల సంతలు కనిపిస్తయా?
ఈ సంతల ఎన్క కష్టం చెమట
ఎవరిదో నీకు ఎరుకున్నదా?

కిల్లెర కొమ్ములు, నెలవంక బోద కొమ్ములు,
'ఒంగోలు' గిత్తలు,
పన్నెండు ఫీట్ల ఎత్తు ఎడ్లు 'అస్సలు'దక్కన్‌వి అని నీకు తెలుసా?
పోని మేపుతున్న ఎడ్లను గుంజుకపోయిన సంగతన్న ఎరుకనా?
సాదినోళ్ళ దగ్గరినుండి ఎడ్లను, ఆవులను గుంజుకున్నరు.
గుత్తాలకు బదులు బండ్లకు ఎడ్లను ఆవులను కట్టిన సంగతి ఎట్ల మరుస్తం?
మేం ఎడ్లను, ఆవులను, బర్రెలను, పోతులను
అడ్విలకు, పస్కలకు కొట్కుపోయి మేపుతం
భూమిని దున్నాలే కాబట్టి మేపుతం
భూమిని దున్నే నేర్పు మెండుగా ఉన్నోళ్ళమని మర్సిపోకు
పశులను పెంచుడే భూమి దున్నేటందుకు అని సోయి దెచ్చుకో

అడ్విని, గడ్డిని, భూమిని, నాగలిని గాలికిడ్సి
పెద్దకూర తినొద్దని పాసి పండ్ల పాట పాడుతున్నవు...
ఇంతకూ నీవేం జేస్తున్నవు ?
ఆవును గోమాతంటున్నవు
దాని పాలన్నీ లోటలకొద్ది తాగుతంటవు
మిఠాయిలు చేసుకుని తింటంటవు.
కాని ఆవు పాలను లేగదూడకియ్యాలనే సోయి నీకున్నదా?

మేం ఆవు పాలను పిండం
గోమాతని పూజించం.. దాని ఉచ్చతాగం
దూడ మూతికి బుట్టికట్టం ఆ పాలను పిండం
దాని పాలు దాని బిడ్డ దూడ కొదిలేస్తం
దూడ బాగ తల్లిపాలు తాగాలే
బలమైన ఎద్దుగా తయారు గావాలే
రేపటి నాటికి భూమి దున్నాలె
ఎవుసం పెరగాలంటే గజ ఏనుగుల్లాగా ఎడ్లు ఉండాలే

ఎడ్లను ఈనే ఆవుని మేం గౌరవిస్తం
దానికి మంచి మంచి పచ్చ గడ్డి, ఎండు గడ్డి, జొన్న జాడు, అలంను మేపుతం
ఆవుతో పని చేపియ్యం
దాన్ని సూపి బిచ్చమడుక్కోం
వీట్నీ బాగా మేపేది ఎడ్ల సంతతి పెరగనీకే
ఎవుసం పెరగాలనే ముందుసూపుతో ఆవును నడ్పుతం
అందరం సంబరంగా ఉన్నప్పుడు
తలా ఇన్ని పైసలేస్కొని అంగడ్కిపొయ్యి
మంచి పెయ్యివట్టిన ఆవును కొనుక్కొచ్చి కోసి పోగులేస్కుంటం
వాడాంత గుమగుమలతో నిండంగ ఒండుకుని తింటం..

కష్టపోతుల కడ్పు పెద్దదిరామరీ
కోడి మేక ఏడ సరిపోతది?

ఎద్దుకు మాయింటి పెద్దకొడుకు చేసే పని భారం మోపుతం
మా మన్సుకు నచ్చిన పేర్లు పెట్టుకుంటం
రామగాడు, ధర్మగాడు, భీమగాడు అని పిల్సుకుంటం
ఆవులు, బర్రెలు, లేగలు మాతోనే మా కుటుంబంల ఉంటయి
లేగలకు ఆవులకు రంగసాని, దామరమొగ్గ, మల్లె సెండు అని చూడ చక్కని పేర్లతో
పిల్సుకుంటం
అంతెందుకు ఎడ్లపండుగ అని పశుల పండగలే చేస్తం
ఏరొంక ఏరువాక అని ఎడ్ల పండుగున్నది ఇన్నవా.. ఎప్పుడన్నా..?
ఎట్ల జేస్తరో ఎమన్నా తెల్సా?

పండుగ నాడు చెరువు వాగు తేట నీళ్ళల్ల
ఇంటి కొట్టంలున్న పశులనన్నింటి పెయిలను
రాసి తోమి కడిగి తానం జేపిస్తం
వాటి పెయి చాయలకు తగ్గ రంగులనద్దుతం
రంగురంగుల నార పనకట్లు కడుతం
మెడలో గంటల మువ్వల దండలు కడుతం
పులుగం, పోలెలు కడ్పునిండ తినవెడ్తం
సారా కోడిగుడ్లను తాపుతం
ఊరంత తిప్పి మెరిపిస్తం

ఎప్పుడు చూసిన ఆవును గూర్చే మాట్లాడుతవు
నీవెప్పుడైనా ఎద్దుగురించి మాట్లాడినవా
ఆవుతో నీకున్న సంబంధమేంటిది?
నీకు ఎద్దుతో అసలే సంబంధం లేదు
నీవెన్నడూ భూమిని దున్నలేదు
దంగుసున్నం తొక్కియ్యలేదు
ఎన్కటి నుండి పోతులతో, ఎడ్లతో మన్ను తొక్కిచ్చి
కోటలు గడీలు బుర్జులు కట్టింది మా వోళ్ళు కాదా?
పెద్దకూర తినొద్దని నీవెందిరా.. మాకు జెప్పేది

ఎద్దును, ఆవును కొయ్యొద్దంటవు పెద్దకూర తినొద్దంటవు
సచ్చిన గొడ్డు కూర బలవంతంగా తినిపిస్తివి.
అంటరాని వాళ్ళంటివి
భూమి లేకుండా చేస్తివి
వెలేసిన గాయిదకి నెడ్తివి
సచ్చిపడిన పశుల కలేబరాలను గుంజిపిస్తివి.
పశువుల సంతతి పెంచడం, అదుపు చేయడం
ఉత్సవాల్లో అమ్మవార్లకు ఎద్దును,
దున్నపోతును అర్పిస్తం

దేవుని పేరుమీద తినడం మా సంస్కృతి
కాదనే హక్కు నీకెక్కడున్నది?

బుద్ధిజాన్ని నఖల్ కొట్టి వాతలు పెట్టుకున్నవు
బుద్ధిజం మనుషులను చంపొద్దన్నది
మీరైతే మేకలను, గొర్లను, వుల్లి, ఎల్లి గడ్డలను తినొద్దంటరు.
మనుషులను మాత్రం కొయ్యాలే సర్కాలే సంపాలే అంటరు
నీవు జంతువుల గురించి ఏందిరా... మాట్లాడేది..?
నీకసలు నాగరికత తెల్వది
నీకసలు సంస్కృతి లేదు

ఎద్దు ఆవు బర్రె పోతులతో మేం నాగరికతను సృష్టించినం
వాటికెన్ని రకాల తిండి దిన్సులున్నాయో
వాటినెట్ల పండించాల్నో మాకు తెలుసు
వాటికెన్ని రకాల రోగాలున్నయో
ఏ మందులెయ్యాల్నో మాకు తెలుసు

కోడెబుద్దలకు ఆరు పండ్లేసి మక్రం బద్దె
వాటికి షేర్లు కొట్టి పనిల ఒంగవెట్టుడు ఎట్లనో...
మాదిగ మాల వాడలకు పోయి తెలుసుకో..
పశువులను పెంచి ఎవుసాన్ని పెంచినం
అందుకే ఇది ఎవుసం దేశం అయ్యిందని జ్ఞానం నేర్చుకో

మల్ల జెప్తున్నం..
ఎద్దు ఆవు బర్రె పోతులతో మేం నాగరికతను సృష్టించినం
పచ్చటి జీవావరణం, నాగరికతలను నిర్మించిన వారసత్వం మాదే!
యుద్ధం, ప్రకృతి విధ్వంసం నీ వారసత్వం
నీవెంత లొడ లొడ కొట్టుకున్నా
పశువులతో అదీ ఆవుతో నీకున్న సంబంధం పరిమితమైందే
పాలు మిఠాయిల శాకాహారమైందే

మా అమ్మవార్లకు మేం దున్నపోతును మేక పోతును అర్పించుకుంటం
మేం తింటం
వద్దన్న వంటే మిగులవేమో ?
మా మైసమ్మ, నూకలమ్మ, పోలేరమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ తల్లులు మమ్ముల
నడుగుతరు..
అరే బిడ్డా నాకు ఎద్దుకావాలేరా..
పోతుకావాలే రా...నాకు మేకపోతులు కావాలేరా...
అడుగుతరు.. మేమిచ్చుకుంటం..!
నీవెవరివిరా కొయ్యొద్దు తినొద్దు అననీకే..
మాదేవతకు మేం ముందే పేరు వెట్టి కాయం జేసి మేపుతం
కాదంటే .......?
కాదన్నోడినే అడుగుతది మైసమ్మ.. సూస్కోమరి.....

**గొడ్డు మాంసం నుండి అనేక పక్క ఉత్పత్తులుంటాయి.**

1. కొమ్ములు మరియు గిట్టలు : తాబేలు చిప్ప ఇమిటేషన్ వస్తువులు, దువ్వెనలు, కుక్కలు నమిలే బొమికలు, ఇమిటేషన్ ఏనుగు దంతం ఉత్పత్తులు, పియానో మీటలు.
2. కొవ్వు, కొవ్వు ఆమ్లాలు : క్రేయాన్లు, క్యాండిల్స్, నేల పాలిష్ చేసే మైనం, డిటర్జెంట్ సబ్బులు, షేవింగ్ క్రీమ్, లిప్‌స్టిక్, డియోడరెంట్ వంటి సౌందర్య సాధనాలు, లూబ్రికెంట్ ద్రావకాలు, ప్లాస్టిక్, టైర్లు, పెర్ఫ్యూమ్స్, పెంపుడు జంతువుల ఆహారం, పశువుల గ్రాసం
3. బొమికల నుండి తీసే జిలాటిన్ : ఫొటోగ్రాఫిక్ ఫిల్మ్, పేపరు మరియు కార్డ్ బోర్డు అతికించే జిగురు, ఎమరీ పేపరు
4. ప్రేవుల నుండి :టెన్నిస్ రాకెట్ తీగలు, ఇతర సంగీల వాయిద్యాల తీగలు
5. చర్మం, జుట్టు : ఫర్నీచర్, మోటర్ వాహనాల సీట్లు, సూట్‌కేసులు, బ్యాగులు, చెప్పలు, బూట్లు, బట్టలు, పల్లాలు, కళ్ళాలు, పెయింట్ బ్రష్‌లు, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, బేస్‌బాల్ కోసం లెదర్.

2010లో మొట్టమొదటి దక్షిణ భారత బిజెపి ప్రభుత్వం 'పశువుల రక్షణ మరియు వధ నిషేధ బిల్లు 2010' తేవటానికి తలపెట్టినపుడు, కర్నాటక అంతా పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. దళిత సంఘాలు ఈ నిరసనలను ముందుండి నడిపించాయి. మార్చి మొదటి వారంలో సభ నుండి బిల్లును ఉపసంహరించుకున్న ప్రభుత్వం, ప్రతిపక్షాల వాకౌట్, బయటి నిరసనల మధ్య, ఆ మరుసటి వారమే మళ్లీ బిల్లును ప్రవేశపెట్టింది. మళ్ళీ దళిత సంఘాలు కర్నాటక అంతా నిరసనలు చేపట్టాయి. బెంగుళూరు యూనివర్శిటీలోని దళిత విద్యార్థులు అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ ముందు బీఫ్ వండి, విద్యార్థులందరికీ వడ్డించారు. వేరే ప్రాంతాలలో కూడా ఇది జరిగింది. బీఫ్‌పైన సెమినార్ నిర్వహించి, బీఫ్ వడ్డించటం నిరసన వ్యక్తం చేయటానికి ఒక పద్ధతిగా మారింది. నిరసన సాహిత్యానికి మంచి ఉదాహరణ ఆవు-పులి సంబంధించిన జానపద పద్యం గురించి జరిగిన చర్చ. ఆవు తనిచ్చిన మాట నిలబెట్టుకోవటానికి, పులి వదిలేసిన తరువాత కూడా, తన బాధ్యత నిర్వహించి మరలా తిరిగి వచ్చే కథ గురించిన పద్యమిది. దీన్ని ఆవు మంచితనం, అగ్రకులాల భావ ప్రపంచంలో ఆ మంచితనం నుండి దానికి లభించే పవిత్రత, ముఖ్యంగా ఆవుని గురించిన పద్యంగా అందరూ అర్థం చేసుకుంటారు. దళిత నిరసన ప్రదర్శనల సందర్భంలో ఈ పద్యానికున్న అగ్రకుల భావార్థాన్ని విమర్శలకు గురిచేస్తూ దళిత రచయితలు చర్చను లేవనెత్తారు.

కింద ఇవ్వబడిన హనుమంతయ్య పద్యం సంఘటనలు జరిగే నాలుగు సంవత్సరాల ముందు రాయబడింది. అయితే హిందువుల ఆవు పూజల ఊహా ప్రపంచాన్ని నిశితంగా విమర్శిస్తూ వచ్చిన సాహిత్యానికి ఒక సమున్నత ఉదాహరణ ఈ పద్యం. ఒక పక్క దళితులు పెద్దకూర తినటాన్ని నొక్కిచెపుతూ, రెండోపక్క వారికి ఆవంటే ఉన్న ప్రేమ మరియు ఆవు ఆలనాపాలనా చూసుకోవటాన్ని కూడా నొక్కి చెప్తుంది. ఆవు-పులి కథను చతురంగా వర్ణిస్తూ అగ్రకులాల వారిని దళితులను తినే పులిగానూ, దళితులను ఆవుని తిని ఆవుగా మారే వారిగానూ చూపిస్తుంది.

# ఆవుని తిని ఆవులా అయ్యాను

■ ఎన్.కె.హనుమంతయ్య

అవును
నేను అంటరాన్ని వాణ్ణి
నేను విద్యుత్ తరంగాన్ని
నన్ను ముట్టుకోకు
నీ వెచ్చని స్పర్శకు చిక్కను

అవును
నేను అంటరాని వాణ్ణి
సముద్రమంత లోతయిన వాణ్ణి
నీ కను మంటలు నన్నేమీ చేయలేవు

అవును
నేను అంటరాన్ని వాణ్ణి
నేను సంభోగిని
ఈ మట్టితో రమిస్తే అడవి, నదీ, జీవజలం
పంట పొలాలు పర్వతాలు పుట్టాయి

అవును
నేను అంటరాన్ని వాణ్ణి...
నీ లాంటి స్వలింగ సంపర్కులకు భయపడను
బిడ్డను ఒడుపుగా పొదిమి పట్టుకొని కొమ్మ కొమ్మకు దూకే కోతి అంటే ఇష్టం నాకు

అవును
నేను అంటరాన్ని వాణ్ణి...
నీళ్ళు, రేపు అనేది లేకుండా
ధనం, అణ్వస్త్ర కొలిమి అయి
భవిష్యత్ లేని నీ మెరుపు కళ్ళకి భయపడను

అవును
నేను అంటరాన్ని వాణ్ణి...
మెరిసే నీ కళ్ళలో భవిష్యత్ లేదు
ఆర్ద్రత అంటే తెలియని విధ్వంశపు చూపు నీది
నీ రోత తిని నీ ఇంటికి కాపలా కాసే కుక్కకు భయపడతా
కలలు కనలేని సీసం కళ్ళు నీవి

అవును!
నేను అంటరాన్ని వాణ్ణి
నేను ఆవుని తిని ఆవులా అయ్యి
లోయలు గట్లు సెలకల్లో చిందేస్తా
కొమ్ములతో మబ్బుల్ని కుమ్మి
తోకతో సింగిడిని చాచి కొట్టి
బొందల గడ్డలో పడేస్తా

అవును!
నేను అంటరాన్ని వాణ్ణి!!
నేను ఆవుని తిని ఆవులా మారాను
నేను ఇప్పుడు మీరిచ్చే
మేత తిని మీలా మనిషిని కాలేను
నరమాంసం ముట్టను

**అనువాదం : గుర్రం సీతారాములు(ఇఫ్లూ డాక్టోరల్ స్టూడెంట్)**
**'గౌవ్వు తిందు గోవినాంతాదవాను'. ఎన్.కె.హనుమంతయ్య కవితా సంకలనం 'చిత్రాదు బెన్ను' (2006) నుండి తీసుకోబడింది. సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ కామర్స్, కన్నడ సంఘ ప్రచురణ.**




**పెద్దకూర :** వండి వడ్డించే భోజనశాలలు చాలాసార్లు తమ 'మెమోకార్డు'లో దాన్ని వేరే పేరుతో చూపుతాయి. లేదా అసలు మెనూలో చూపవు. రక్షణ దొరికే ప్రదేశాల్లో ఎక్కువగా ఉంటాయి. కళ్యాణి బిర్యాని దీనికొక మంచి ఉదాహరణ. ఇది చిన్న చిన్న ముస్లిం భోజనశాలల్లో నగరమంతా దొరుకుతుంది. గొడ్డు మాంసం బిర్యానీకి పర్యాయపదమే కళ్యాణి బిర్యాని. ఈ భోజనశాలలు తమ ప్రవేశ ద్వారాలు వగైరాలన్నీ ఏ హంగామా లేకుండా ఉంచుకుంటాయి. ఉండటమే ఇవి పేద, దిగువ మధ్య తరగతి ప్రజలు జీవించే బస్తీలలో ఉంటాయి. కేరళ భోజనశాలల మెనూలలో మాత్రం పెద్దకూర కొట్టొచ్చినట్లు కనపడుతుంది. ఇక్కడ కూడా, ఉన్నత వర్గాలుండే లొకాలిటీలోని భోజనశాలలో పెద్దకూరని 'మీట్' (మటన్ కాదు) అని చూపిస్తున్నారు. కొంత స్నేహపూరిత వాతావరణంలో ఉన్న కేరళ భోజనశాల మెనూలో 'పెద్దకూర'అని స్పష్టంగా రాస్తున్నారు.




**Vegetarian Hegemony**

Ann Mary George and Aby Abraham Veerappillil went around the city taking pictures of restaurants and teashops. They faced reluctant owners and managers when they asked to photograph the insides, so many of the images in the collage above were taken from the shelter of an autorickshaw! The images convey the predominant features of eating houses in the city. What are these? For one, they usually have a proper name, Reddy, Iyengar, Balaji, Aiyappa, in their signage which boldly signal that an upper caste person, a superior human being or a god has blessed the enterprise. Two, they often have a word in their name that describes the purity of their product (e.g., 'pure'), yet they are most often not very cleanly maintained (in fact recently, the most prestigious and oldest sweet house in Hyderabad was shut down due to unsanitary conditions). They are by and large vegetarian. They invite the customer to step in, confident of their own status and ritual purity. They rule the urban foodscape.

There are non-vegetarian restaurants too, which most often serve chicken or fish. If they are Muslim or Irani restaurants they serve mutton and sometimes beef. Restaurants that serve beef are usually less prominent and direct in their signage. They are also not in prime public locations. Entrances are low profile. At the other end, it is possible to have a beefsteak in the stratospheric heights of a five star restaurant.

It is nearly impossible to find a restaurant that announces that it belongs to a Mala or Madiga owner. One wonders when a time will come when we can go to a restaurant that proclaims its 'lower' caste status with the pride that comes from the promise of a tasty and nutritious food culture!

**శాఖాహార ఆధిపత్యం:**

ఆన్ మేరీజార్జ్, ఏబీ అబ్రహం వీరప్పిల్లిల్ నగరమంతా తిరుగుతూ భోజనశాలలు, టీ దుకాణాల ఫోటోలు తీసారు. భోజనశాలల యజమానులు, మేనేజర్లు ఫోటోలు తీయటానికి ఇష్టపడకపోవటం వల్ల ఈ ఫోటోల్ని చాలా మటుకు ఆటోరిక్షాలోంచి తీసుకోవల్సి వచ్చింది. ఈ చిత్రాలు మనకు నగరంలోని భోజనశాలలు, ఫలహారశాలల ముఖ్య లక్షణాలను తెలుపుతాయి. ఏంటవి? మొదటిది, చాలా వరకూ ఇవి రెడ్డి, అయ్యంగార్, బాలాజీ, అయ్యప్ప వంటి పేర్లతో ఉంటాయి. ఒక అగ్రకుల వ్యక్తి, ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి, లేదా దేవుడు తమ వ్యాపారానికి దన్నుగా ఉన్నట్లు ముఖం మీదే చెప్తాయి. పేరులోనే 'శుద్ధమైన' వంటి పదాలతో తమ తినుబండారాలు 'అతి శుద్ధమైనవని' చెప్పుకుంటాయి. అయితే, పేరు పెట్టుకున్నంత మాత్రాన అవి శుద్ధమైనవని చెప్పలేం. (ఈ మధ్యనే నగరంలో అతి ప్రసిద్ధి చెందిన స్వీట్ల దుకాణాన్ని శుభ్రంగా లేదని మునిసిపల్ అధికారులు కొన్ని రోజులపాటు మూసేసి ఉంచారు) మూడవది, చాలావరకు ఇవి శాకాహార భోజనశాలలు, తమ సామాజిక స్థానంవల్ల లభించే 'పవిత్ర, శుద్ధత'లను వ్యాపార నమ్మకంగా మార్చుకుని వినోయోగదారుల్ని తమ భోజనశాలల్లోని ఆహ్వానిస్తాయి.

మాంసాహార భోజనశాలలు కోడి లేదా చేప మాంసాన్ని వడ్డిస్తాయి. అదే ముస్లిమ్ భోజనశాలల్లో మేక, గొర్రె మాంసం, కొన్ని సందర్భాల్లో పెద్దకూరని పెడతారు. అయితే పెద్దకూర వండే భోజనశాలలు ప్రముఖంగా ఉండవు. తమ గురించి చాటించపు వేయవు కూడా. ముఖ్యమైన కూడళ్ళలో కూడా ఉండవివి. ప్రవేశ ద్వారాలు ప్రస్ఫుటంగా ఉండవు. అదే పెద్ద పెద్ద ఐదు నక్షత్రాల భోజనశాలల్లో, చుక్కలు కన్పించే ధరలకు పెద్దకూర వంటకాలు రుచి చూడచ్చు.

తాము ఒక మాల లేదా మాదిగ యజమాని అధ్వర్యంలో నడపబడేవని చాటింపు వేసే భోజనశాలలు వెతుకుదామన్నా కనపడవు. తాము రుచికరమైన, పౌష్టికాహార సంస్కృతికి చెందిన వాళ్ళం కాబట్టి అటు వంటి వంటకాలను తప్పకుండా అందించగటమనే నమ్మకంతో తమ 'తక్కువ కుల' స్థాయిని గర్వంగా చెప్పుకునే భోజనశాలలకు మనం వెళ్ళగలిగే రోజులు ఎప్పుడొస్తాయో?